జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 5 సంచిక 107 | హైదరాబాద్, ఫిబ్రవరి 07 సోమవారం 2022 | 8 పేజీలు | వెల : 5.00



# త్వరలోనే రైల్ కోచ్ ఫ్యాక్టరీ @వరంగల్: కేటీఆర్

వరంగల్: వరంగల్‌లో రైల్ కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామన్న హామీని కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయినా, తమకు దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ సెక్టార్ రైల్ కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కాబోతుందని మంత్రి కె.టి.రామారావు పేర్కొన్నారు. ఈ మేరకు కేటీఆర్? ఆదివారం ట్వీట్ చేశారు. మేధా గ్రూప్‌చే ఏర్పాటు చేసిన దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రైలు కోచ్ ఫ్యాక్టరీలలో ఒకటి హైదరాబాద్ శివారులోని కొండకల్‌లో త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని ట్వీట్? చేశారు మంత్రి కేటీఆర్?.తెలంగాణ త్వరలో రైలు కోచ్‌లను తయారు చేసి రవాణా చేయబోతున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఇది జరిగేలా చేసిన యుగంధర్ రెడ్డికి, అతని టీమ్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మేధా స ర్వో డ్రైవ్స్ రైల్ కోచ్ ఫ్యాక్టరీ ఫొటోలను ట్విట్టర్‌లో షేర్ చేశారు.

# నేడు యాదాద్రికి కేసీఆర్



హైదరాబాద్ : నేడు యాదాద్రికి వెళ్లనున్నారు సీఎం కేసీఆర్. సోమవారం ఉదయం 11 గంటలకు యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రానికి కేసీఆర్ వెళ్లనున్నారు. ముగింపు దశలో ఉన్న పునర్నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. ఆలయ పున: సంప్రోక్షణ నిర్వహించనున్నారు. సుదర్శన యాగం, ఇతర ఏర్పాట్లపై చర్చించనున్నారు. మార్చి 22వ తేదీ నుంచి 28 వ తేదీ వరకు వారం రోజుల పాటు అంతర్జాతీయ స్థాయిలో ఘనంగా యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పున: ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే అతిథులు, పీఠాధిపతులు యోగులు, స్వామీజీలు, కోట్లాదిగా తరలివచ్చే జనం కోసం కల్పించే సౌకర్యాలపై చర్చించనున్నారు సీఎం. సోమవారం ఉదయం 11.30 గంటలకు సీఎం కేసీఆర్ హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళతారు. యాదాద్రి పుణ్యక్షేత్రం పునర్నిర్మాణం పనులు పూర్తి స్థాయిలో ముగిసిన నేపథ్యంలో అన్నింటినీ సీఎం పరిశీలించనున్నారు. ఏరియల్ వ్యూ ద్వారా యాదాద్రి ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. ప్రధాన ఆలయం, క్యూలైన్లు, (మిగతా 2లో..)

# అధికారక లాంఛనాలతో లతాజీ అంత్యక్రియలు..



ముంబై : లెజెండరీ సింగర్ లతా మంగేష్కర్ (92) ఇక లేరు. ముంబై బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో నేడు ఉదయం 8గం. 12ని. తుదిశ్వాస విడిచినట్లు సమాచారం. గత 29రోజులుగా ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. గత నెల 8వ తేదీన కరోనాతో ఆమె ఆస్పత్రిలో చేరిన సంగతి తెలిసిందే. ఆపై కరోనా నుంచి రికవరీ అయిన ఆమె.. వెంటిలేటర్‌పై కొన్నాళ్లు చికిత్స పొందారు. ఈ క్రమంలో ఆమె కోలుకుంటున్నట్లు వైద్యులు ఈమధ్యే ప్రకటించారు కూడా. అయితే పరిస్థితి విషమించడంతో ఆమెకు మళ్లీ వెంటిలేటర్ మీదే చికిత్స అందించారు. లెజెండరీ సింగర్, భారతరత్న అవార్డు గ్రహీత అయిన లతా మంగేష్కర్ భౌతికకాయాన్ని ముంబయిలోని పెద్దర్ రోడ్ నివాసం అయిన ప్రభు కుంజ్ నుండి శివాజీ పార్క్ కు తీసుకువెళ్లారు, అక్కడ లతాజీ అంత్యక్రియలు ఇవ్వాల సాయంత్రం అధికారిక లాంఛనాలతో ముగిశాయి.

## సీఎం కేసీఆర్ సంతాపం..

### లతా జీ లేని లోటు పూరించలేనిదంటూ ఆవేదన



భారత రత్న, దిగ్గజ గాయని లతా మంగేష్కర్ ఇక లేరు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ముంబైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు . జనవరిలో లతా మంగేష్కర్‌కి కరోనా సోకింది. అప్పటి నుంచి ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కరోనాతో పాటు న్యుమోనియా కూడా ఉండడంతో ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించింది. క్రమంగా అవయవాలు పనిచేయడం ఆగిపోయాయి. ఇవాళ ఉదయం 08.10 ఆమె తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లతా మంగేష్కర్ మృతిపట్ల సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులతో పాటు ఇతర అన్ని రంగాల ప్రముఖులు నివాళి అర్పిస్తున్నారు. ఆమె భౌతికంగా మన మధ్య లేకున్నా.. పాట రూపంలో ఎప్పటికీ ఉంటారని పేర్కొంటున్నారు. లతా మంగేష్కర్ మరణం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

## నివాళులర్పించిన ప్రధాని మోడీ



ముంబైలోని శివాజీ పార్క్ లో లెజెండరీ సింగర్ లతా మంగేష్కర్‌కు ప్రధాని నరేంద్ర మోదీ నివాళులర్పించారు. ప్రధాని మోదీ శివాజీ పార్క్ వద్ద లతా మంగేష్కర్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె భౌతికకాయానికి పరిక్రమ పూజతో చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ సందర్భంగా లతా మంగేష్కర్ సోదరి, గాయని ఆశా భోంస్లే, ఆమె కుటుంబ సభ్యులకు ప్రధాని తన సంతాపాన్ని తెలిపారు. వేదిక వద్ద ఉన్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధినేత రాజ్ ఠాక్రేలను కూడా ప్రధాని మోదీ కలిశారు.

**రెండు రోజుల పాటు సంతాప దినాలు**

లతా మంగేష్కర్‌కు నివాళిగా యావత్ దేశం రెండు రోజుల పాటు సంతాప దినాలు పాటించనుంది. రెండు రోజుల పాటు జాతీయ జెండా సగం వరకు ఎగరేయనున్నారు.

# అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం సంగతేంటి?

## కేసీఆర్ కు బండి సూటి ప్రశ్న



హైదరాబాద్ : సీఎం కేసీఆర్ పై మరోసారి తెలంగాణ బీజేపీ చీఫ్ బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం పనుల పురోగతిని పరిశీలించేందుకు ఎన్టీఆర్ గార్డెన్ పక్కనున్న స్థలాన్ని బిజెపి శాసనసభ పక్ష నేత రాజాసింగ్ తోపాటు ఇతర బీజేపీ నాయకులతో కలిసి బండి సంజయ్ సందర్శించారు. ఆరేళ్ల క్రితం ప్రారంభమైన అంబేద్కర్ విగ్రహం పనులు నేటికీ విగ్రహ పనులు పూర్తికాలేదని అన్నారు. 2016 ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి రోజు కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారని బండి సంజయ్ అన్నారు.



## పంజాబ్ కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చరణ్‌జిత్ సింగ్ చన్నీ..

పంజాబ్: పంజాబ్ పాలిటిక్స్‌లో ఉత్కంఠకు తెరపడింది. ఇన్నాళ్ల సస్పెన్స్‌కు తెరదించారు కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ. ఎట్టకేలకు పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే ముఖ్యమంత్రి అభ్యర్థిని కాంగ్రెస్ ఆదివారం ప్రకటించింది. కాంగ్రెస్ ముఖ్యనేత ఎంపీ రాహుల్ గాంధీ లూథియానాలో వర్చువల్ ర్యాలీలో ప్రసంగిస్తూ ప్రస్తుత ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీపై విశ్వాసం వ్యక్తం చేస్తూ ఆయన పేరును ప్రకటించారు. చన్నీజీ ముఖ్యమంత్రి అయ్యారని, ఆయనకు అహం లేదని, ప్రజల్లోకి వెళతారని రాహుల్ గాంధీ అన్నారు. (మిగతా 2లో..)

## మానవత్వం చాటిన కానిస్టేబుల్..

### అనాధను అక్కున చేర్చుకున్న పోలీస్



నల్గొండ : పోలీసులు నిత్యం ఏదో పనిలో బిజీగా ఉంటారు. అయినా ఓ కానిస్టేబుల్ ఒత్తిడి ఉన్నా వాటిని పక్కకు పెట్టి తన మానవత్వాన్ని చాటుకున్నారు. 70ఏళ్ల ఓవృద్ధురాలు అలకాపురికాలనీ, కలెక్టరేట్ ప్రాంతాల్లో తిరుగుతూ బిక్షాటన చేసుకుంటూ జీవిస్తుంది. కొన్నిరోజులుగా అన్నపానీయాలు లేకుండా రోడ్డు పక్కన స్పృహ తప్పిపడిపోయింది. అటుగా వెళుతున్న ఎవరూ పట్టించుకోకుండా పోతున్నారు. అయితే పెట్రోలింగ్ చేస్తున్న నల్గొండ వన్ టౌన్ కానిస్టేబుల్ శీలం వినోద్ కుమార్ ఆమెను చూసి చలించిపోయారు. ఆ వృద్ధురాలిని మందలించినా ఉలుకుపలుకు లేదు. వెంటనే మంచినీళ్లు తెచ్చి ముఖం కడిగి నీళ్లు తాపించారు. అక్కడ నుండి తీసుకుపోయి పెట్రోల్ బంక్ పక్కన కూర్చోబెట్టి భోజనం చేయించారు. అప్పుడు ఆ వృద్ధురాలి ముఖంలో కళ వచ్చింది. వృద్ధురాలిని అక్కున చేర్చుకున్న కానిస్టేబుల్ వినోద్ ను పోలీస్ అధికారులు, సిబ్బందితోపాటు జనం అభినందిస్తున్నారు.



## ఎస్టీపి నిర్మాణాన్ని ఆపివేయండి

### ప్రభుత్వం కబ్జాలకు పాల్పడుతుంది

**కొండా విశ్వేశ్వర్ రెడ్డి**

రంగారెడ్డి : కబ్జాలను అరికట్టాల్సిన ప్రభుత్వమే కబ్జాలకు పాల్పడుతోందని విమర్శించారు మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి. రంగారెడ్డి జిల్లా నెక్నపూర్ చెరువులో ఎస్టీపి నిర్మాణాన్ని కొండా విశ్వేశ్వర్ రెడ్డి వ్యతిరేకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అక్కడ అక్రమంగా ఎస్టీపి నిర్మాణం చేస్తోందన్నారు. వెంటనే నిర్మాణ పనులను ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా చెరువును స్థానికులు కాపాడుకుంటున్నారని, రూ. 7 కోట్లతో సుందరీకరణ పనులు కూడా చేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజాభీష్టాన్ని గౌరవించాలన్నారు.



## నిషేధిత గుట్కా జర్దా ఉత్పత్తులను అమ్మ రాదు

**వికారాబాద్ పట్టణ సిఐ రాజశేఖర్**



వికారాబాద్ బ్యూరో 06 ఫిబ్రవరి ప్రజాపాలన : ప్రభుత్వం నిషేధించిన గుట్కా జర్దా వంటి నిషేధిత ఉత్పత్తులను పాన్ డబ్బాలలో విక్రయించరాదని వికారాబాద్ పట్టణ సీఐ రాజశేఖర్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాన్ డబ్బా యజమానులకు నిషేధిత మత్తుపదార్థాల ఉత్పత్తులను విక్రయించరాదని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ మాట్లాడుతూ ప్రజలకు నష్టం కలిగించే మత్తుపదార్థాల ఉత్పత్తులను అమ్మి నట్లయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోబడతాయని గట్టిగా హెచ్చరించారు. నిషేధిత మత్తు పదార్థాలు కొని నా అమ్మినా వారిపై తగిన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఏ పాన్ డబ్బా యజమాని కూడా నిర్వహించరని ఆశిస్తున్నాను అన్నారు. చట్ట వ్యతిరేక పనులు నిర్వహించి మీకు, మీ కుటుంబ సభ్యులకు ఇబ్బంది కలిగించరాదని హితవు పలికారు.

## మంగళవారం శ్రీ అనంత పద్మనాభ స్వామి వారి సప్త వాహన సేవలు: ఆలయ ఈఓ టి నరేందర్



వికారాబాద్ బ్యూరో 0 6 ఫిబ్రవరి ప్రజా పాలన : 8 ఫిబ్రవరి 20 22 మంగళవారం శ్రీ అనంత పద్మనాభ స్వామి వారి సప్త వాహన సేవలు జరుపబడును ఆలయ ఈవో టి నరేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి సప్త వాహన కార్యక్రమాల వివరాలు ఉ7.30 సూర్యప్రభవాహనం, ఉ9.00 హనుమంతవాహనం, ఉ10.30 శేష వాహనం, ఉ11.00 గరుడ వాహనం, మ.3.00 గజ వాహనం, సా.4.00 సింహ వాహనం, సా.5.00 చంద్రప్రభవాహనంపై స్వామి వారి సేవలు సాగుతాయని వివరించారు. ప్రస్తుతం కోవిడ్ దృష్ట్యా భక్తులు ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలి. భౌతిక దూరం పాటించాలి. మాస్కులు లేనిదే అనుమతి లేదని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఎన్. పద్మనాభం, ఈఓ టి. నరేందర్ తెలిపారు.

## తూటికుంట్ల గ్రామంలో చేతి పంపు ఏర్పాటు



బోనకల్ ,ఫిబ్రవరి 6 ప్రజా పాలన ప్రతినిధి: బోనకల్ మండలం తూటికుంట్ల గ్రామంలో ఖమ్మం జి టి ట్రిబుల్ ఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఎస్ టి కాలనీలో యూ సి ఎం చర్చిలో చేతి పంపు బోరు వేసినారు. ఈ బోరు పంపు ను బోనకల్ మండలం ఎంపీపీ కంకణాల సౌభాగ్యం, గ్రామ సర్పంచ్ నోముల వెంకట నరసమ్మ చే ప్రారంభించ బడినది. ఈ సందర్భంగా సర్పంచ్ మరియు ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ ప్రజల కొరకు మంచి పని చేసిన జి టి ట్రిబులెక్స్ సంస్థను వారి సేవలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎవరెస్ట్ పాల్, యూ సి ఎం చర్చి పాస్టర్ పాల్ , మహిళలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం సంగతేంటి?

(మొదటి పేజీ తరువాయి)

ఏడాదిలో అంబేద్కర్ జయంతి నాటికి 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఇక ఆ తరువాత ఆ ఊసే లేదు అని ఆయన మండిపడ్డారు. అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు కూడా వెళ్లని మూరు?డు కేసీఆర్ అని ఆయన అన్నారు.కేసీఆర్ దళితులను మోసం చేశారని బండి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడితే దళితుడినే మొదటి ముఖ్యమంత్రి చేస్తానని హామీని విర్మరించారని ధ్వజమెత్తారు. తానే సీఎం పదవి చేపట్టి దళితులను దారుణంగా మోసం చేశాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో దళిత కుటుంబానికి 3 ఎకరాల భూమిని పంపిణీ చేస్తామని మాయ మాటలు చెప్పారని ఫైర్ అయ్యారు. దళితులకు మూడెకరాల సంగతి దేవుడెరుగు. వాళ్ల పేరిటనున్న అసైన్డ్ భూములను కూడా లాక్కున్న నీచమైన చరిత్ర కేసీఆర్ ది అని ఆరోపించారు.

## పంజాబ్ కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చరణ్‌జిత్ సింగ్ చన్నీ..

(మొదటి పేజీ తరువాయి)

నిరుపేద ఇంటి ముఖ్యమంత్రి కావాలని పంజాబ్ ప్రజలు చెప్పారని, పేదరికాన్ని ఎవరు అర్థం చేసుకుంటారో, పంజాబ్‌ను అర్థం చేసుకుంటారని, పంజాబ్‌కు ఆ వ్యక్తి అవసరమని రాహుల్ గాంధీ అన్నారు. ఇది చాలా కష్టమైన నిర్ణయమని, అయినప్పటికీ పంజాబ్ ప్రజలు, కార్మికుల అభిమతం మేరకు చన్నీని ప్రకటిస్తున్నట్లు రాహుల్ గాంధీ తెలిపారు.

## నేడు యాదాద్రికి కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

శివాలయం, పుష్కరిణిని పరిశీలించనున్నారు. యాదాద్రిలో జరుగుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకోనున్నారు ముఖ్యమంత్రి.

# మధిర పట్టణ మండల ఆర్యవైశ్య కమిటీల ప్రమాణ స్వీకారం



మధిర ఫిబ్రవరి 6: ప్రజాపాలన ప్రతినిధి :మధిర శ్రీ వాసవి ఆర్య వైశ్య కళ్యాణ మండపం లో ఆదివారం మధిర పట్టణ మండల ఆర్యవైశ్య సంఘాల ప్రమాణ స్వీకారం మహోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడిగా కిరణ్ మండల అధ్యక్షుడిగా దాచేపల్లి ముత్యాలు ఈ రెండు కమిటీల సభ్యులు ప్రమాణ స్వీకారం చేసినారు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వనమా కిరణ్ మాట్లాడుతూ మధిర పట్టణ ఆర్యవైశ్యులు అందరూ సహకారంతో ముందుకు వెళ్తానని ఆర్యవైశ్యులకు మన పట్టణ ఆర్యవైశ్య సంఘం తరఫున ఎటువంటి సహకారాన్ని అయినా అందిస్తానని తెలియజేసినారు అలాగే మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దాచేపల్లి ముత్యాలు నా వంతు సహకారాన్ని మా కమిటీ వారితో సంప్రదించి మండల ఆర్యవైశ్య సంఘాన్ని ముందుకు నడిపే విధంగా పాటుపడతానని తెలియజేసినారు ఈ కార్యక్రమంలో లో జిల్లా ఆర్యవైశ్య సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కోశాధికారులు, ఆయా ఉన్నత పదవుల్లో ఉన్న ఆర్య వైశ్యులు ఈ కార్యక్రమానికి విచ్చేసి శుభాకాంక్షలు తెలియజేశారు మధిర టౌన్ లో ఉన్న ఆర్య వైశ్య సంఘాలు, వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ ,శ్రీ వాసవి ఆర్య వైశ్య కళ్యాణ మండపం అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ మల్లు నందిని పాల్గొని ఆర్యవైశ్య సంఘాలకు మా వంతు సహకారం అందిస్తానని తెలియజేశారు ఈ కార్యక్రమంలో కపిలవాయి జగన్ మోహన్ రావు బాలకోటి రంగా వెంకటేశ్వరరావు కోధమూరు జనార్ధన్ జగన్ మోహన్ రావు వినుకొండ లక్ష్మీ నరసింహారావు ప్రకాష్ గుప్త దాచేపల్లి ముత్యాలు పురుషోత్తం సూరి కృష్ణారావు రాజు పల్ల పోతుల ప్రసాద్ సురేష్ బాణాల నాగేశ్వరావు చల్లా సత్యనారాయణ నరసింహారావు దొడ్డ మురళి కుర్రోళ్ళ కృష్ణ ఆర్య వైశ్యులు వాసవి క్లబ్ వాసవి వనిత అన్ని ఆర్య వైశ్య సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చిన్నబీరవల్లి లో శ్రీ శ్రీ మహామృత్యుంజయేశ్వర సహిత నవగ్రహ ప్రతిష్ట మహోత్సవం

బోనకల్ , ఫిబ్రవరి 6 ప్రజాపాలన ప్రతినిధి: మండల పరిధిలోని చిన్న బీరవల్లి, నారాయణపురం నందు శనివారం శ్రీ శ్రీ శ్రీ పార్వతి సమేత భీమేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీ మహా మృత్యుం జయేశ్వర నవగ్రహ ప్రతిష్ట మహోత్సవం శనివారం వేద పండితుల మధ్య నిర్వహించారు. చిన్న బీరవల్లి , నారాయణపురం గ్రామాలలో సుమారు 400 సంవత్సరాల క్రితం అతి ప్రాచీన శ్రీ శ్రీ శ్రీ పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆ రోజు నుంచి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. కొన్ని సంవత్సరాల తర్వాత ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో నారాయణపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పరుచూరి మురళి కృష్ణ ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామ ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు సుమారు 20 లక్షల రూపాయలతో సి సి రోడ్డు వేయించారు. మరో 20 లక్షలతో భీమేశ్వర స్వామి ఆలయాన్ని పునః నిర్మాణాన్ని చేపట్టారు. అక్కడ అవసరమైన అన్ని వసతులను ఏర్పాటు చేశారు. వేద పండితుల మధ్య భీమేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీ మహా మృత్యుంజయ నవగ్రహ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమాన్ని వేద పండితుల మధ్య ఆదివారం నిర్వహించారు. జనవరి 27వ తేదీ నుంచి ఆరో తేదీ వరకు పూజా కార్యక్రమాలు చేపట్టారు. 27న గణపతి పూజ, మహాగణపతి హోమం, ఉదకశాంతి, గ్రామ తోరణ స్థాపన నిర్వహించారు. 28న దీక్ష హోమం, ఏకాదశరుద్రాభిషేకం, పంచగవ్య స్నపన, రుద్ర దిగ్బంధ హోమాలు, శిలాబలిహరణ, రుద్ర హోమం నిర్వహించారు. 29న తైలాభిషేకం, శని గ్రహ దోష నివారణ పూజలు, శని గ్రహ పాసుపతి హోమం, రుద్రాభిషేకం నిర్వహించారు. 30 న సూర్యారాధన, సూర్య నమస్కారములు, అరుణ, మహా సౌర పారాయణ, సూర్య పాసుపత హోమం నిర్వహించారు. 31 నుంచి ఈనెల ఐదు వరకు వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆరో తేదీన రత్నన్యాస, సంస్కార యుక్తముగా యంత్ర ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించను న్నారు. నవగ్రహ సహితముగా మహామృత్యుంజయ విగ్రహ ప్రతిష్ఠాపన, జీవకళ హోమములు, ప్రాణ ప్రతిష్ఠాపన హోమములు, మహా పూర్ణాహుతి, అన్నదానం, శాంతి కళ్యా నాధులు నిర్వహించారు. అనంతరం దీక్ష విసర్గ – మహా దాశీర్వచనం, ఆర్యాది రుత్వికుల అందరికీ సంభావన పూర్వక సన్మానం కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# యువతకు ఆదర్శం.. షేక్ రషీద్: ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయులు





గుంటూరు. ప్రజా పాలన :నరసరావుపేట నియోజకవర్గం నుండి జాతీయ అండర్ -19 క్రికెట్ జట్టుకు ఎంపిక అయ్యి ఖ్యాతి సాధించిన వైస్ కెప్టెన్ షేక్ రషీద్‌కు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రత్యేక అభినందనలు తెలిపారు.జట్టు విజయ కేతనంలో ప్రధాన భూమిక పోషించడం గర్వకారణం భవిష్యత్తులో రాణించేందుకు విజ్ఞాన్ సంస్థల నుండి సహాయ సహకారాలు అందిస్తామని ఎంపీ వెల్లడినరసరావుపేట వేదికగా ఘనంగా సన్మానం నిర్వాహిస్తాం ఎంపీ శ్రీకృష్ణదేవరాయులులి సామాన్య వ్యవసాయ కుటుంబం నుండి పట్టుదలతో అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఇండియా అండర్–19 క్రికెట్ టీమ్ వైస్‌కెప్టెన్ షేక్ రషీద్ ను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. నరసరావుపేట నియోజకవర్గం నుండి ప్రపంచ స్థాయిలో రషీద్ ఖ్యాతి సాధించడం గర్వకారణం ఉందని, పేదరిక ప్రతిభకు అడ్డంకి కాదని..నిర్దిష్ట లక్ష్యం, పట్టుదల, మక్కువ, శ్రమ ఉంటే సాధించలేనిది ఏమి ఉండదని షేక్ రషీద్ నిరూపించాడని, ఇతను యువతకు ఆదర్శంగా నిలిచాడని ఎంపీ కొనియాడారు.

ఇండియా అండర్ 19క్రికెట్ టీం నేడు వరల్డ్ కప్ సాధించటంలో రషీద్ ప్రధాన పాత్ర పోషించాడని, కీలకమైన సెమీ ఫైనల్స్‌లో 94పరుగులు, ఫైనల్‌లో క్లిష్ట పరిస్థితుల్లో 50పరుగులు కొట్టి టీంను విజయతీరాల వైపు నడిపించడం గర్వంగా ఉందన్నారు. ఏడేళ్ల వయస్సులోనే బ్యాట్ పట్టిన షేక్ రషీద్ ను చూసి.. అతనికి క్రికెట్‌పై ఉన్న ఆసక్తిని గుర్తించి రషీద్ తండ్రి ప్రోత్సహించాడని, వ్యవసాయ పనులు చేసుకుంటూ, ప్రైవేట్ బ్యాకింగ్ రంగంలో లోన్స్ రికవరీ ఏజెంట్ గా జీవనం సాగిస్తున్న షేక్ రషీద్ తండ్రి బలిషావలి.. రషీద్‌కు ఎటువంటి లోటు చేయకుండా క్రికెట్‌లో రాణించేందుకు అండగా నిలబడటం పట్ల వారి తల్లిదండ్రులను ఎంపీ ప్రసంచించారు.

విజ్ఞాన్ సంస్థల నుండి సహాయసహకారాలు అందిస్తాం తన నియోజకవర్గమైన రషీద్ భవిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించేందుకు అండగా ఉంటామని, జాతీయ స్థాయి క్రికెట్ వరకు ఎదిగేందుకు అవసరమైన సహాయ సహకారాలు విజ్ఞాన్ సంస్థల నుండి అందిస్థామని ఎంపీ పేర్కొన్నారు.

నరసరావుపేట వేదికగా సన్మానం నిర్వహిస్తాం

నరసరావుపేట నుండి నేడు అంతర్జాతీయ ఖ్యాతి సాధించిన రషీద్‌కు ఘనంగా సన్మానం ఏర్పాటు చేస్తామని, అతను ఇండియాకు తిరిగిరాగానే.. అతను సాధించిన ఘనతను తెలిపేలా.. ఇతని స్ఫూర్తిని యువత ఇనుమడింప చేసుకునేలా నరసరావుపేట వేదికగా ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీ వెల్లడించారు.

షేక్ రషీద్ తల్లిదండ్రుల స్వస్థలం గుంటూరు జిల్లాలోని, ప్రత్తిపాడు మండలం, పాత మల్లాయ పాలెం. వృత్తి రిత్యా వీరు నరసరావుపేట నియోజకవర్గంలోని, రొంపిచర్ల మండలంలోని, బుచ్చిపావన్న పాలెంలో స్థిర పడ్డారని, రషీద్ విద్యాభ్యాసం నరసరావుపేట పరిధిలోనే కొనసాగుతుందని వారి తల్లిదండ్రులు వివరించారు. ప్రస్తుతం రషీద్ నరసరావుపేటలోని రెడ్డి కళాశాలలో ఇంటర్‌మీడియట్ సెకండ్‌ఇయర్ చదువుతున్నాడు.

# గిరిజన ప్రాంతాల్లో ఏరులై పారుతున్న కల్తీ నాటుసారా





తూర్పు గోదావరి జిల్లా ప్రజా పాలన ప్రతినిధి: దేవీపట్నం కొత్త అంగళూరు గ్రామంలో రహదారి పక్కనే కిరాణా షాపు పేరుతో అక్రమ మద్యం,కల్తీ సారా,గుట్కా వ్యాపారం జోరుగా సాగుతోంది. దేవీపట్నం మండలం చివర గ్రామంగా ఉండడం వలన ఈ ప్రాంతంలో ఎన్ ఫోర్స్ మెంట్ బ్యూరో దాడులు అరాకొర జరుగుతుండటంతో ఈ గిరిజన ప్రాంతం నందు గుడుంబా వ్యాపారులు రెచ్చిపోతున్నారు. పోలవరం ప్రాజెక్టు నందు పని చేసే సుమారు 3000 మంది కార్మికులకు నిత్యం కల్తీసారా సరఫరా చేస్తుండటంతో బడుగు జీవుల జీవితాలను కాపుసారా కాటేస్తుంది. ఈ బడ్డీ కొట్టు వద్ద కార్మికులు ఎంతోమంది కాపు సారా తాగి ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. కిరాణా షాపు వెనుక కావాల్సినంత సారా తాగవచ్చు నని షాపు యజమాని భరోసా ఇవ్వడంతో పోలవరం ప్రాజెక్టు కార్మికులు,యువత మద్యం మత్తుకు బానిసలవుతున్నారు. బ్రతకడానికి పనులు లేక వేరే రాష్ట్రాల నుండి పోలవరం ప్రాజెక్ట్ పనులకు వచ్చినవారిని ఆసరాగా తీసుకుని ఈ సారావ్యాపారులు రెచ్చిపోతున్నారు. కుటుంబ యజమానులు ఎప్పుడు వస్తారా అని ఎదురు చూస్తూ ఉండే ఆ రాష్ట్ర మహిళలకు,కుటుంబీకులకు చివరకు కన్నీళ్లే మిగులుతున్నాయి. కొత్త అంగళూరు గ్రామంలో కల్తీసారాతో కొందరు ఆసుపత్రుల పాలవుతుంటే ఇంకొందరు ప్రాణాలు కోల్పోతూ మరి కొందరు మద్యం మత్తులో పోలవరం ప్రాజెక్టు పనుల్లో ఘోరాతి ఘోరమైన ప్రమాదాలకు గురవుతున్నారు. సమీప ప్రాంతమైన పోచమ్మ గండి కొండల్లో నాటు సారా తయారీ కేంద్రాలు అధికంగానే ఉన్నాయి. కాపు సారా పేద ప్రజల ప్రాణాలను తీస్తుందని పలువురు మహిళలు ఆవేదన చెందుతున్నారు. ఈ అక్రమ మద్యం,సారా వ్యాపారం వలన వందల మంది బలైపోతున్నారని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. పోలీసులు, ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు దాడులు నిర్వహిస్తున్నప్పటికీ రోజురోజుకు మితిమీరి పోతున్నారు సారా వ్యాపారులు. సీతానగరం మండల కేంద్రం బ్రాందీ షాపుల నుండి కొత్తఅంగుళూరు గ్రామానికి చెందిన బెల్టు షాపులకు మద్యం అనధికారికంగా తరలిపోతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాహనాలపై అతి వేగంగా తరలిస్తున్న సారా వ్యాపారులను అడ్డుకోబోయే యత్నంలో పోలీసులు కొన్నిసార్లు విఫలమైన సందర్భాలు ఎదురవుతున్నాయని ప్రజలు అంటున్నారు. తాగుడుకు బానిసలైన వారికి ఈ కిరానా షాప్ నందు విచ్చలవిడిగా ఖైనీ గుట్కాలతోపాటు... పలు రకాల మత్తు పదార్థాలు దొరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో సారా తాగి ప్రజలు రోగాల బారిన పడుతుంటే కుటుంబాలు వీధిన పడేవి సారా కట్టడికి చర్యలు తీసుకుంటామని కల్తీ సారా రహిత జిల్లాలుగా తీర్చిదిద్దుతాం అంటూ నాయకులు చేసే వ్యాఖ్యలు మాటలకే పరిమితం అయ్యాయి అంటున్నారు ఇక్కడ ప్రజలు. పల్లెల్లో మళ్లీ సారా గుప్పుమంటున్నా బెల్లం, ఈస్ట్ అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. సారాకు బానిసలైన జనం అటు జేబులను ఇటు ఆరోగ్యాన్ని గుల్ల చేసుకుంటున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ప్రజా సంఘాల నుండి వెల్లువెత్తుతున్నాయి. నేటి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దఫదఫాలుగా మద్యపానం,కల్తీ సారాను నిర్మూలించేందుకు చర్యలు చేపడుతున్నా మరికొన్ని చోట్ల మొలాసిస్ తో నాటుసారాను కాస్తున్నారు. తద్వారా సారా తయారీ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఏదిఏమైనా ఈ కొత్త అంగళూరు ప్రాంతం నందు విచ్చలవిడిగా సారా విక్రయాలు అరికట్టాలని పురుషోత్తపట్నం, సీతానగరం మండల పలు గ్రామాల ప్రజలు,కొత్త అంగలూరు గ్రామం మహిళలు,ప్రాజెక్టు పనుల కోసం వచ్చిన వారి కుటుంబీకులు ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి వార్తలు

### జై భీమ్!!

**డియర్ బహుజన లీడర్స్**

**ఇప్పటివరకు 16 అసెంబ్లీ నియోజక వర్గాలకు నియోజకవర్గ ప్రెసిడెంట్ గా నియమించడం జరిగింది. మీకు తెలిసిన బహుజన నాయకులు అసెంబ్లీ నియోజకవర్గాలు ప్రెసిడెంట్ గా నియమించడానికి అర్హులు అనుకుంటే తెలియపరచండి.**

**Sivabhagyarao bahujan**
**నేషనల్ కన్వీనర్**
**పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి**
**Jaipuley JaiBahujan Jai Bharat**

# మహిళ కాంగ్రెస్ అధ్వర్యంలో అంబెడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం..

ఖమ్మం ఫిబ్రవరి 6 ప్రజాపాలన ప్రతినిధి : మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం లోని జడ్పీ సెంటర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నుండి ర్యాలీగా తరలివెళ్లిన మహిళ కాంగ్రెస్ నాయకులు. కార్యకర్తలు అంబెడ్కర్వా విగ్రహానికి పాలతో అభిషేకం చెశారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ తెలంగాణ ముఖ్య మంత్రి కేసీఆర్ అధికార మదంతో, నిరంకుశ స్వభావంతో భారత దేశ రాజ్యాంగాన్ని అవమానిస్తూ పత్రికా సమావేశంలో భారత





రాజ్యాంగాన్ని మార్చాలి అని మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను అని అన్నారు. . కెసిఆర్ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని మహిళా డిమాండ్ చెశారు. స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ భారత రాజ్యాంగాన్ని తెలుపుతూ ఈ దేశంలోని గుళ్లోకి నాకు ప్రవేశం లేక పోయినా గాని ప్రజాస్వామ్యానికి పెద్ద గుడి అయినటువంటి పార్లమెంట్లో నాకు అవకాశం కల్పించింది భారత రాజ్యాంగం అని కొనియాడారు.అటువంటి రాజ్యాంగం గురించి హేళన చేస్తూ కెసిఆర్ మాట్లాడిన విధానం సభ్య సమాజం మొత్తం తీవ్రంగా ఖండిస్తోంది అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గా ప్రసాద్ , సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావిద్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడ్లపల్లి సంతోష్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముక్క శేఖర్ గౌడ్ ,నాయకులు వడ్డే నారాయణ రావు ఏలూరు రవి గారు దేవత శంకర్ నాయక్. రబ్బానీ. 57వ డివిజన్ కార్పొరేటర్ రఫీదా బేగం. కొనిజర్ల ఎంపీటీసీ స్వర్ణలత అమ్మపాలెం ఎంపీటీసీ అనూష తుమ్మల పల్లి సర్పంచ్ రేణుక ధనలక్ష్మి కృష్ణవేణి నాగమణి దివ్య రజిని పాల్గొన్నారు.

## మండల పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం



మధిర ఫిబ్రవరి6 ప్రజా పాలన ప్రతినిధి మధిర మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం నాడుకాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు విలేకరుల సమావేశం జరిగింది ఈ సమావేశంలో మధిర మండల అధ్యక్షులు సూరం శెట్టి కిషోర్ మధిర మున్సిపల్ కౌన్సిలర్లు కోన దని కుమార్, మునుగోటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 8వ వార్డు కౌన్సిలర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వై వి అప్పారావు ఇచ్చిన సవాళ్లను కాంగ్రెస్ పార్టీ స్వీకరిస్తుంది ప్లేసు డేటు మీరు చెప్పండి అలాగే మీరు ఫ్లోర్లీడర్ కాబట్టి మీరు సవాలు చేశారు అంటే మీ పార్టీ కౌన్సిలర్ మొత్తం సవాలు చేసినట్లు మా కౌన్సిలర్స్ రాజీనామా పత్రాలు పార్టీ ప్రెసిడెంట్ గా నేను తీసుకొని వస్తాను అలాగే మీ పార్టీకి రాజీనామాలు మీరు తీసుకురండి పత్రికా విలేకరుల వద్ద ఈ రాజీనామా పత్రాలు పెట్టి మేము మీరు మున్సిపాల్టీలో చేసిన అవినీతి పై ఆధారాలతో నిరూపించ కాకపోతే మా కౌన్సిలర్ ఇద్దరూ రాజీనామా చేస్తారు మేము ఆధారాలతో నిరూపిస్తే మీ కౌన్సిలర్ మొత్తం రాజీనామా చేయండి అలాగే డెవలప్మెంట్ విషయంలో కూడా మున్సిపాలిటీ అయిన తర్వాత ఒక సంవత్సరం పాటు మేము అధికారం లో ఉన్నాము ఉన్నాము అప్పుడు మేము చేసిన డెవలప్మెంట్ ఏంటో మేము చెబుతాము అలాగే మీరు అధికారంలోకి వచ్చి ఏడు సంవత్సరాలు అయింది మీరు చేసిన డెవలప్మెంట్ ఏంటో మీరు చెప్పండి దీనిని కూడా సవాలుగానే స్వీకరిస్తున్న మీ కంటే ఎక్కువ నిధులు తెచ్చి ఉండకపోతే పార్టీ ప్రెసిడెంట్ గా నేను రాజీనామా చేస్తా లేకపోతే మీ పార్టీ వారు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉండండి డెవలప్మెంట్ అంటే చెట్లు నాటడం, గాబ్బుల్లో లో నీళ్లు పారబోయడం కాదు, ఆ లాంటి ఫోటోలను చూసి నీవు డెవలప్మెంట్ అనుకుంటున్నావ్ ఏమో డెవలప్మెంట్ అంటే అది కాదు. ఈ కార్యక్రమంలో మధిర మండల ఎస్సీసెల్ అధ్యక్షులు దారా బాలరాజు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అద్దంకి రవికుమార్ ఐ ఎన్ టి యు సి కోరంపల్లి చంటి మాజీ సర్పంచ్ కర్నాటి రామారావు పారుపల్లి విజయ్ కుమార్ పులి బండ్ల చిట్టి బాబు బిట్రా ఉద్దండు ఆదూరు శ్రీనివాస్, ఆదిమూలం శ్రీనివాస్ మైలవరపు చక్రి, దోమమందులు సురేష్ తదితరులు పాల్గొన్నారు

## గీత పని వాళ్ళ కోసం తుది శ్వాస వరకు పోరాడిన నాయకుడు బొమ్మగాని ధర్మభిక్షం

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

బోనకల్, ఫిబ్రవరి 6 ప్రజా పాలన ప్రతినిధి: గీత పని వారుల కోసం బడుగు బలహీన అభ్యున్నతి కోసం అహర్నిశలు పోరాడిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు బొమ్మగాని ధర్మభిక్షం జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొత్తగూడెం మాజీ శాసన సభ్యులు కునంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముష్టికుంట్ల గ్రామంలో ఆదివారం జరిగిన బొమ్మగాని ధర్మభిక్షం శత జయంతి వేడుకలు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు వంగాల పెద్ద వెంకటేశ్వర్లు జండా ఆవిష్కరించగా, ధారగాని నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగాయి. ఈ జయంతి వేడుకలలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, కౌన్సిల్ సభ్యులు బొమ్మగాని నాగభూషణం తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొమ్మగాని ధర్మభిక్షం ప్రజల కోసం గ్రంథాలయ ఉద్యమాన్ని నడిపి హైదరాబాద్ రాష్ట్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేశారన్నారు. నల్లగొండలో మొట్టమొదటిసారిగా కమ్యూనిస్టు సెల్ ఏర్పాటు చేసి యువకులను పోరు మార్గంవైపు నడిపాడని ఆయన కొనియాడారు. 1952లో హైదరాబాద్ రాష్ట్రంలో జరిగిన మొట్ట మొదటి ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించిన నాయకుడిగా ఆయనకు కీర్తి ఉందన్నారు. 1952లో సూర్యాపేట నియోజకవర్గం నుండి 1957 లో నకిరేకల్ నియోజకవర్గం నుండి 1962 లో నల్లగొండ నియోజక వర్గం నుండి మూడు సార్లు ఎమ్మెల్యేగా, నల్లగొండ పార్లమెంట్ నుండి రెండు సార్లు ఎంపీగా ఆయన విజయం సాధించారని గుర్తు చేశారు. గీత పని వాళ్ల కోసం తన తుది శ్వాస వరకు పోరాడిన బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పెట్టడంతోపాటు ఆయన జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించడమే ఆయనకు నిజమైన నివాళి అని, కనుక తెలంగాణ ప్రభుత్వం తక్షణమే ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు . శత జయంతి ఉత్సవాల సందర్భంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు తోడేటి కొమురయ్య, వంగాల పెద్ద వెంకటేశ్వర్లుతోపాటు బోనకల్ మండలం లోని కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘాల పదకొండు అధ్యక్షులు అందరిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో గీతపని వారుల



సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి దూసరి శ్రీరాములు గౌడ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, మాజీ ఎంపీపీ చిట్టిమోదు నాగేశ్వరరావు,సీపీఐ బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ బంధం శ్రీనివాసరావు, ధారగాని కృష్ణ, నాయకులు మరీదు హనుమంతరావు, కొనకళ్ల పిచ్చయ్య, బంధం వెంకన్న, ధారగని ఏడుకొండలు, ఆకెన పవన్ తదితరులు పాల్గొన్నారు.

## బత్తిని చారిటబుల్ ట్రస్ట్ మెగా క్యాంపు విజయవంతం



బోనకల్, ఫిబ్రవరి 6 ప్రజాపాలన ప్రతినిధి: మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో పేద ప్రజల మనిషి, అమరజీవి తూము ప్రకాష్ రావు జ్ఞాపకార్థం మేఘ శ్రీ హాస్పిటల్ నందు నిర్వహించే బీపీ, షుగర్, కంటి ప్రత్యేక వైద్య శిబిరం బీపీ, షుగర్, కంటి పేషెంట్లకు ఓ వరమని మేఘ శ్రీ హాస్పిటల్ జనరల్ వైద్య నిపుణులు లక్కబత్తిని గంగాధర్ గుప్తా అన్నారు. మండల కేంద్రంలో ప్రతి నెల మొదటి ఆదివారం నిర్వహించే బీపీ, షుగర్, కంటి ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఈ ప్రత్యేక క్యాంపు మండల ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉందన్నారు. 100 రూపాయలకే బీపీ షుగర్ మందులు అందజేస్తున్న బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ను అభినందించారు . మండల ప్రజలు ఈ ప్రత్యేక క్యాంపును సద్వినియోగి%శీ%చుకోవాలని పేర్కొన్నారు. ఈ క్యాంపు లో వైద్యులు గంగాధర్ గుప్తా బీపీ, షుగర్ పేషెంట్ లను పరీక్షించి మందులను అందజేశారు . కంటి వైద్య నిపుణులు శీలివేరి అశ్విన్ సిదార్ద్ కంటి పరీక్షలు నిర్వహించగా, దంత వైద్యులు సోమనపల్లి ఉదయ్ కిరణ్ దంత వైద్య సేవలు అందించగా క్యాంపు నిర్వాహకులు ఆకెన పవన్, ఆర్ఎంపీడబ్ల్యూటీఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మి నేని కొండలరావు, సాధన పల్లి అమర్నాద్ లు క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, ట్రస్ట్ సభ్యులు తూము కుమార్, వైస్ ఎంపీపీ గుగులోత్ రమేష్, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనంద్ రావు, ఏలూరి పూర్ణ చంద్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే మోదీ పై తప్పుడు ప్రచారం



మంచిర్యాల బ్యూరో, పిబ్రవరి 06, ప్రజాపాలన : సింగరేణి సంస్థలో టిఆర్ఎస్ చేసిన అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకోవడం కోసం, కేంద్ర ప్రభుత్వం నరేంద్రమోడీ పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని జిల్లా అధ్యక్షులు రఘునాథ్ విమర్శించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడారు. గత ఏడు సంవత్సరాల నుంచి సింగరేణి లో 73వేల ఉద్యోగాలను 42 వేల కు కుదించి ఎంతో మంది నిరుద్యోగ సమస్యకు టీబీజీకేఎస్ పాల్పడిందని అన్నారు. అదేవిదంగా టీబీజీకేఎస్ సింగరేణి లో చేస్తున్నటువంటి అన్యాయాలను సింగరేణి చేస్తున్నటువంటి అక్రమాలను కప్పిపుచ్చుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ ఏదో చేస్తున్నారంటూ తప్పుడు ప్రచారం తో కార్మికులను మోసం చేయడానికి టిఆర్ఎస్ , టీబీజీకేఎస్ ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. కమర్షియల్ మైనింగ్ చట్టం 2015లో పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు ఆ బిల్లుకు అప్పుడు ఎంపీగా ఉన్నటువంటి టీబీజీకేఎస్ గౌరవధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత .బాల్క సుమన్ టీఆర్ఎస్ ఎంపీలు ఆ చట్టానికి ఓటు వేశారని గుర్తు చేశారు. ఈ చట్టం పై అభ్యంతరాలు తెలపాలని చెప్పినప్పటికీ 2021 వరకు టిఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి అభ్యంతరాలు తెలియజేయలేదని పేర్కొన్నారు. టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చే ముందు ఓపెన్ కాస్ట్‌కు వ్యతిరేకం అని చెప్పినటువంటి టిఆర్ఎస్, 2014 నుంచి ఇప్పటి వరకు ఆరు ఓపెన్ కాస్ట్ ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ మండల అధ్యక్షులు కౌన్సిలర్ రాజు బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి తులా ఆంజనేయులు, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు ,బిజెపి నాయకులు సతీష్ రావు, మల్యాల శ్రీనివాస్, రజనీష్, పట్టి కృష్ణ, రంగ శ్రీశైలం, మల్లేష్, ప్రభాకర్ రావు, రమేష్, అశోక్, సాయి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


## హిందుస్థాన్ బయో సైన్సెస్ లిమిటెడ్

ప్లాట్ నెం. 31, సాగర్ సొసైటీ, రోడ్డు నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్-500034, ఇండియా, ఫోన్: 040-23555161, 23555181, ఫ్యాక్స్: 040-40205171, వెబ్‌సైట్: www.hindustanbiosciences.in, ఇ-మెయిల్: pharma.hindustanbio@gmail.com, CIN: L26942TG1991PLC013564

31 డిసెంబర్, 2021తో ముగిసిన త్రైమాసిక కాలానికి ఆడిట్ కాని ఫలితాల వివరణ పట్టిక

(రూ. లక్షలలో)

| క్ర.సం. | వివరములు | ముగిసిన మూడు నెలలు 31.12.2021 (ఆడిట్ కానిది) | 30.09.2021 (ఆడిట్ కానిది) | 31.12.2020 (ఆడిట్ కానిది) | ముగిసిన తొమ్మిది నెలలు 31.12.2021 (ఆడిట్ కానిది) | 31.12.2020 (ఆడిట్ కానిది) | ముగిసిన సం॥ 31.03.2021 (ఆడిట్ చేసినది) |
|---|---|---|---|---|---|---|---|
| 1. | వ్యాపార పనులు జరిపి పొందిన ఆదాయము | | | | | | |
| | ఎ) వ్యాపార పనులు జరిపి పొందిన ఆదాయము | 23.96 | - | 0.02 | 43.38 | 88.21 | 103.19 |
| | బి) ఇతర ఆదాయము | 0 | 5.24 | | 5.24 | - | - |
| | మొత్తం ఆదాయము (1) | 23.96 | 5.24 | 0.02 | 48.62 | 88.21 | 103.19 |
| 2. | ఖర్చులు | | | | | | |
| | ఎ) వినియోగించిన మెటీరియల్ వ్యయం | - | - | - | - | - | - |
| | బి) స్టాక్ - ఇన్- ట్రేడ్‌లో కొనుగోలు | 15.90 | - | - | 28.93 | 34.03 | 34.03 |
| | సి) పూర్తి అయిన వస్తువుల జాబితాలో మార్పులు, స్టాక్ ఇన్ వర్తకం మరియు కార్యక్రమంలో మార్పులు | - | - | 0.02 | - | 23.93 | 34.01 |
| | డి) ఉద్యోగుల మేలుకై చేసిన ఖర్చులు | 5.93 | 6.12 | 6.08 | 18.11 | 18.32 | 24.64 |
| | ఇ) ఫైనాన్స్ ఖర్చులు | 0.13 | 0.08 | 0.38 | 0.28 | 0.68 | 0.69 |
| | ఎఫ్) అమ్మకాలకై చేసిన ఖర్చులు | 0.38 | - | - | 0.61 | 0.62 | 0.62 |
| | జి) తరుగుదల మరియు అమార్టైజేషన్ ఖర్చులు | 0.08 | 0.08 | 0.16 | 0.24 | 0.49 | 0.80 |
| | హెచ్) రద్దు చేయబడిన మొత్తం | - | - | - | - | - | 80.23 |
| | ఐ) ఇతర ఖర్చులు | 1.74 | 4.49 | 4.72 | 13.72 | 13.49 | 23.70 |
| | మొత్తం ఖర్చులు (2) | 24.16 | 10.77 | 11.36 | 61.89 | 91.56 | 198.72 |
| 3. | అసమాన్య మరియు అసాధారణ ఐటంలకు మరియు పన్నుకు ముందు లాభం / (నష్టం) మరియు పన్ను (1-2) | (0.20) | (5.53) | (11.34) | (13.27) | (3.35) | (95.53) |
| 4. | అసాధారణ అంశాలు | - | - | - | - | - | - |
| 5. | లాభం / (నష్టం) పన్ను ముందర (3-4) | (0.20) | (5.53) | (11.34) | (13.27) | (3.35) | (95.53) |
| 6. | పన్ను ఖర్చులు | | | | | | |
| | ఎ. ప్రస్తుత పన్నులు | - | - | - | - | - | - |
| | బి. గత సంవత్సరం పన్నులు | - | 0.03 | - | 0.03 | - | 1.68 |
| | బి. వాయిదా వేసిన పన్నులు | - | - | - | - | - | 0.13 |
| 7. | సామాన్య కార్యకలాపాల ద్వారా పొందిన లాభాలు /(నష్టాలు) (5-6) | (0.20) | (5.50) | (11.34) | (13.24) | (3.35) | (93.98) |
| 8. | లాభం /(నష్టం) కార్యకలాపాలు నిలిపివేయబడిన వాటికి | - | - | - | - | - | - |
| 9. | నిలిపివేయబడిన కార్యకలాపాల పన్ను ఖర్చులు | - | - | - | - | - | - |
| 10. | నిలిపివేయబడిన కార్యకలాపాల ద్వారా లాభం / నష్టం (8-9) | - | - | - | - | - | - |
| 11. | ఆ సమయంలో లాభం / (నష్టం) (7+10) | (0.20) | (5.50) | (11.34) | (13.24) | (3.35) | (93.98) |
| 12. | ఇతర సమగ్ర ఆదాయం | | | | | | |
| | ఎ) 1) లాభం లేదా నష్టానికి తిరిగి వర్గీకరించబడని అంశాలు | - | - | - | - | - | - |
| | 2) లాభం లేదా నష్టానికి తిరిగి వర్గీకరించని వస్తువులకు సంబంధించిన ఆదాయపు పన్ను | - | - | - | - | - | - |
| | బి) 1) లాభం లేదా నష్టానికి తిరిగి వర్గీకరించబడిన అంశాలు | | | - | | | - |
| | 2) లాభం లేదా నష్టానికి తిరిగి వర్గీకరించబడిన వస్తువులకు సంబంధించిన ఆదాయపు పన్ను | - | - | - | - | - | - |
| 13 | కాలానికి మొత్తం సమగ్ర ఆదాయం (11+12) (కాలానికి లాభం (నష్టం) మరియు ఇతర సమగ్ర ఆదాయం కలిగి ఉంటుంది) | (0.20) | (5.50) | (11.34) | (13.24) | (3.35) | (93.98) |
| 14 | పెయిడ్ అప్ ఈక్విటీ కాపిటల్ (ప్రతి వాటా యొక్క ఫేస్ వ్యాల్యు రూ. 10/-) | 1,025.08 | 1,025.08 | 1,025.08 | 1,025.08 | 1,025.08 | 1,025.08 |
| 15 | ఇంతకుముందర అకౌంటింగ్ సంవత్సరపు బాలెన్స్ షీట్‌ను అనుసరించి మళ్ళీ విలువ కట్టిన నిల్వలను మినహాయించగా ఉన్నటువంటి నిల్వలు | | | | | | (894.62) |
| 16 | వాటా ఒక్కింటికి పొందిన ఆర్జనలు | | | | | | |
| | ఎ. బేసిక్ | (0.00) | (0.05) | (0.11) | (0.13) | (0.03) | (0.92) |
| | బి. డైల్యూటెడ్ | (0.00) | (0.05) | (0.11) | (0.13) | (0.03) | (0.92) |
| 17 | ఆపరేషన్లు నిలిపివేయడానికి ఈక్విటీ వాటాకి ఆదాయాలు | | | | | | |
| | ఎ. బేసిక్ | - | - | - | - | - | - |
| | బి. డైల్యూటెడ్ | - | - | - | - | - | - |
| 18. | ఆపరేషన్లు నిరంతరంగా కొనసాగడానికి మరియు నిలిపివేయడానికి ఈక్విటీ వాటాకి ఆదాయాలు | | | | | | |
| | ఎ. బేసిక్ | (0.00) | (0.05) | (0.11) | (0.13) | (0.03) | (0.92) |
| | బి. డైల్యూటెడ్ | (0.00) | (0.05) | (0.11) | (0.13) | (0.03) | (0.92) |

గమనిక:
1. ఆడిట్ చేయబడని ఆర్థిక ఫలితాలు 04.02.2022న జరిగిన డైరెక్టర్ల బోర్డు సమావేశంలో వారిచే పరిగణనలోనికి తీసుకొనబడినవి.
2. గత సంవత్సరపు అంకెలు అవసరమైన చోట రీగ్రూప్ చేయబడినవి.

హిందుస్తాన్ బయో సైన్సెస్ లిమిటెడ్ తరపున
సం/- జె. వరుణ్ వర్మ
డైరెక్టర్
(DIN:00515430)

ప్రదేశం: హైదరాబాద్
తేది :04-02-2022

ప్రజాపాలన

సంపాదకీయం

సోమవారం 07, ఫిబ్రవరి 2022

## అమ్మభాష, ఆంగ్లభాష రెండూ ఉండాలి

పాఠశాల స్థాయిలో ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు ఇంగ్లీష్ మాధ్యమం ప్రవేశపెట్టడానికి ఉభయ తెలుగు రాష్ట్రాలు పూనుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు మాధ్యమం లేకుండా పూర్తిగా ఇంగ్లీష్ మాధ్యమం ప్రవేశపెట్టారు. ఆ నిర్ణయం వివాదాస్పదమై హైకోర్టు పరిధిలో వ్యాజ్యం నడుస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రం ఇంగ్లీష్ మీడియంను వచ్చే విద్యాసంవత్సరం అనగా 2022-23 నుంచి ప్రవేశపెట్టేందుకు నిర్ణయించింది. తెలుగు మాధ్యమాన్ని కూడా కొనసాగిస్తామని ప్రకటించింది. ఇంగ్లీష్ మాధ్యమ ప్రవేశంపై కొంత మంది హర్షామోదాలు, మరికొంత మంది అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. మాతృభాషకు గుండెల్లో గుడికట్టుకోవడం, ఇంగ్లీష్‌ను ప్రపంచీకరణ గమనంలో నేర్చుకోవడం అవశ్యం. రెండు భాషల అధ్యయనంలో సంధానం, సమన్వయం, ప్రణాళిక, హేతుబద్ధత లేని ఎడల ఏ భాషలో కూడా కనీస పరిజ్ఞానం లేనివారుగా భావిభారత పౌరులు తయారవుతారు. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాలలోనూ ప్రస్తుతం కొనసాగుతున్న విద్యావ్యవస్థను విద్యార్థుల ప్రమాణాలను గమనంలోకి తీసుకుందాం. ఏఎస్ఈఆర్ (యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు) 2018 నివేదిక ప్రకారం 5వ తరగతి చదివే పిల్లలలో దాదాపు సగం మంది మాత్రమే తమ మాతృభాషలోని 2వ తరగతి పుస్తకం చదవగలుగుతున్నారు. ఏఎఆర్ నివేదిక ప్రకారం ఎల్ఎస్‌డబ్ల్యూఆర్ (లెర్నింగ్, స్పీకింగ్, రైటింగ్, రీడింగ్) విభాగాలలో విద్యార్థుల సామర్థ్యం అతితక్కువగా 30-40శాతం వరకు మాత్రమే ఉన్నది. 2019 యునిసెఫ్ రిపోర్టు ప్రకారం నాణ్యత, నిపుణతలేని బోధకులు, కాలంచెల్లిన పాఠ్యాంశాలు, మౌలిక సదుపాయాల కొరత భారతీయ విద్యావ్యవస్థను బలహీనపరుస్తున్నాయి. కంఠస్తం చేయడం తప్పితే విషయ పరిజ్ఞానం ఉండదు. పరిశీలన, విశ్లేషణ అంతకంటే అబ్బవు. ఈ కారణంగానే ఏటా చదువులు పూర్తి చేసుకుని పట్టభద్రులుగా తయారవుతున్న 1.31 కోట్ల మంది విద్యార్థులలో ప్రతి పది మందిలో ఒక్కరికి మాత్రమే ఉద్యోగావకాశం లభిస్తున్నది. యునెస్కో నివేదిక ప్రకారం మన దేశంలో సింగిల్ టీచర్స్ వ్యవస్థ విస్తారంగా ఉంది. కనుక 11.16 లక్షల మంది అదనపు టీచర్స్ కావాల్సి ఉన్నది. అందులో భాగంగా తెలంగాణలో మొత్తం 41,000 స్కూల్స్ ఉంటే 15.71 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 45 వేల పాఠశాలలు ఉండగా 14.4 శాతం సింగిల్ టీచర్ స్కూల్స్ ఉన్నాయి. అలాగే తెలంగాణలో 20 వేల పోస్టులు, ఆంధ్రాలో 20 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా విద్యాసంబంధమైన గ్రాడ్యుయేషన్ లేకుండా అతితక్కువ వేతనంతో పనిచేస్తున్న విద్యావాలంటీర్స్ తెలంగాణలో 18,178. ఆంధ్రాలో 8,000 మంది ఉన్నారు. ఈ విధంగా నిపుణతలేని విద్యావాలంటీర్స్, అన్ని సబ్జెక్టులకు సింగిల్ టీచర్స్ వ్యవస్థ ఉంటే లేత పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చును. ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టాలనే ఆశయం, ఆలోచన మంచిదే కాని మాతృభాషను మృతభాషగా మారనీయకూడదు. బ్రిటన్‌లో ఇంగ్లీష్ మాతృభాషగా కొనసాగిస్తూనే ప్రాథమిక స్థాయిలో 5, 6, 7 తరగతుల్లోనే ఫ్రెంచ్, జర్మనీ, చైనీస్ భాషలు నేర్పుతున్నారు. కెనడాలోని ఫ్రెంచ్ మాతృభాషగా కలిగిన కొన్ని రాష్ట్రాల్లో ఫ్రెంచ్‌ను ఫస్ట్ లాంగ్వేజ్‌గా కొనసాగిస్తూ ఆంగ్లమాధ్యమాన్ని నేర్చుకుంటున్నారు. తెలుగును బ్రతికించుకోవాలి, ఇంగ్లీష్ నేర్చుకోవాలి. ఇంగ్లీష్ బోధకులు 10 నుంచి 15 శాతం మంది కూడా లేని ఈ దశలో హడావుడిగా ఇంగ్లీష్ మాధ్యమం ప్రవేశపెట్టడం వలన విద్యార్థుల భవితకు తీవ్ర హాని జరుగుతుంది. అందువలన ముందుగా ఇంగ్లీష్ మీడియం పాఠ్యాంశాలను బోధించే వారి సంఖ్య ఎంత అవసరమో అంచనాకు వచ్చి కేవలం ఇంగ్లీష్ మీడియం చదివి టీచర్ అర్హత కలిగిన వారిని లేక ఇంగ్లీష్ మీడియంలో చదివి తెలుగులో బోధిస్తున్న వారిని ఎంపిక చేయాలి. అలాకాకుండా తెలుగు బోధకులకే ఓరియంటేషన్ క్లాసులు, ట్రైనింగ్ క్లాసులు జరిపి వారితో ఇంగ్లీష్ క్లాసుల బోధనలు జరిపితే విద్యార్థుల భవిష్యత్తు ఆగమవుతుంది. అసలు ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియం అనే విభజన అవసరమా? ఒకే క్లాసులో ఇంగ్లీష్, తెలుగును బోధించవచ్చును. ఇంగ్లీష్, తెలుగు, హిందీలు భాషా సబ్జెక్టులు. అవి పోను మిగిలినవి సోషల్, సైన్స్, మాథ్స్ - ఈ మూడు సబ్జెక్ట్స్‌కు సంబంధించిన పాఠ్య పుస్తకాలలోని పాఠ్యాంశాలు ఇంగ్లీష్, తెలుగు భాషలు రెండిటిలోనూ ఉండాలి. పైన పేర్కొనబడిన విధంగా ఇంగ్లీష్ నేపథ్యం కలిగిన టీచర్స్‌ను ఎంపిక చేసుకుంటే వారు ఇంగ్లీష్ పాఠం బోధిస్తూ దానికనుగుణంగా తెలుగులో కూడా బోధన చేయవచ్చును. ఆ విధంగా విద్యార్థులు రెండు భాషలను ఏకకాలంలో సులభంగా గ్రహించగలుగుతారు. వేరువేరు పేర్లతో రెండు మీడియంలు లేకుండా సిబిఎస్ఈ సిలబస్, స్టేట్ సిలబస్ పేరుతోనే 1వ తరగతి, 2వ తరగతి నుంచి 12?వ తరగతులుగా పేర్కొనవచ్చును. ఆ విధంగా టీచర్స్ లభ్యత, క్లాస్ రూమ్స్ లభ్యత, ఇతర ఖర్చులు కూడా కలిసి వస్తాయి. నూతన విద్యావిధానం ప్రకారం నర్సరీ నుంచి 2వ తరగతి వరకు ఫౌండేషన్ క్లాసులుగా 3, 4, 5 తరగతులు ప్రిపరేటరీ తరగతులుగాబీ 6, 7, 8 తరగతులు మిడ్ స్కూల్, 9, 10, 11, 12 తరగతులు సెకండరీ స్కూల్స్‌గా పరిగణిస్తారు. నర్సరీ, ఎల్‌కెజీ, యూకేజీల వరకు పుస్తకాలతో నిమిత్తం లేకుండా ప్లే వే మెథడ్ ద్వారా రెండు భాషల్లో మాట్లాడటం వరకు నేర్పవచ్చును. 1, 2వ తరగతులకు రైటింగ్ స్కిల్స్ నేర్పించవచ్చును. 3, 4, 5 తరగతులకు ప్రాథమిక సిలబస్, 6, 7, 8 తరగతులకు మాధ్యమిక విద్య, 9 నుంచి 12 వరకు సెకండరీ విద్య రెండు భాషల్లోనూ సులభతరంగా నేర్పవచ్చును. ఆ విధంగా ఫౌండేషన్ స్థాయిలో ఇంగ్లీష్, తెలుగు మాట్లాడటం, ప్రాథమిక స్థాయిలో రాయడం, ఆ తర్వాత ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యను అందించడం వలన నాణ్యతతో కూడిన విద్యను అందించవచ్చును. ప్రాథమిక స్థాయిలో ఉచ్చారణ (ఫోనెటిక్స్) తరగతులు, గణిత నైపుణ్యాలు, తెలుగు శతకాలు, ఇంగ్లీష్ రైమ్స్ లాంటివి నేర్పవచ్చును. ఇప్పటివరకు మనం పేపర్, పెన్ టెస్ట్‌కే ప్రాధాన్యత ఇచ్చాం. ప్రశ్నా, సమాధానాల పద్ధతికి ప్రాధాన్యత ఇచ్చాం. ఆ పరీక్షా పద్ధతిని రద్దుచేసి ఓపెన్ టెస్ట్ బేస్ ఎస్సెస్మెంట్, జస్ట్ ఏ మినిట్ ప్రోగ్రాం, ప్రాజెక్టు వర్కు తదితర ఎస్సెస్మెంట్ టూల్స్ ద్వారా నూతన విద్యావిధానం ప్రకారం పిల్లల నైపుణ్యతను అంచనా వేయాలి. విద్యారంగం వెనుకబాటుతోనే మానవ అభివృద్ధి సూచీలో భారతదేశ స్థానం 131గా ఉన్నది. నార్వే లాంటి దేశాలు ఇండెక్స్ ప్రథమ స్థానంలో ఉన్నాయి. కారణం, స్కాండినేవియన్ దేశాలైన డెన్మార్క్, నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, మరికొన్ని ఇతర దేశాలలో ఉపాధ్యాయ ఎంపిక సివిల్ సర్వీస్‌స్థాయి అధికారుల లాగా ఎన్నోసార్లు వడబోసి సెలక్ట్ చేస్తారు. వారి వేతనాలు కూడా ఐఏఎస్, ఐపిఎస్ లాంటి సివిల్ సర్వీస్ అధికారుల కంటే అధికంగా ఉంటాయి. ఆ విధంగా ఆయా దేశాలలో విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. మన దేశంలో కూడా ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ సర్వీస్ లాగా ఇండియన్ టీచింగ్ సర్వీస్ (ఐటీఎస్)ను నెలకొల్పి నిష్ణాతులైన టీచర్స్‌ను ఎంపిక చేసి ఐఏఎస్, ఐపీఎస్‌తో సమానమైన వేతనాలు సమకూరిస్తే ఉత్తమ ఉపాధ్యాయులతో నర్సరీ నుంచి బోధన చేయించవచ్చును. పాఠశాల విద్య మొత్తం ప్రభుత్వ రంగంలో నడపాలంటే బడ్జెట్ ఎలా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. కొఠారి కమిషన్ సిఫారసులను అనుసరించి కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో విద్యకు 20-30శాతం కేటాయింపులు జరపాలి. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి జీడీపిలో 4.43 శాతం విద్యారంగానికి కేటాయిస్తున్నారు. బడ్జెట్‌లో 30 శాతం డిమాండ్ ఉండగా తెలంగాణలో 7.5 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 12 శాతం ఈ విద్యాసంవత్సరంలో కేటాయింపులు జరిపారు. ఈ బడ్జెట్ ప్రకారం కూడా ఆయా ఆర్థిక సంవత్సరాల్లోని నిధులు పూర్తిగా విడుదలగాని పరిస్థితి చూస్తున్నాం. అలాగే కేంద్రం తను ఇవ్వవలసిన నిధులను కూడా ఇవ్వడం లేదు. ఉపాధ్యాయులకు అన్ని విధాల ప్రోత్సాహాన్ని అందిస్తూ ఫౌండేషన్ స్థాయిలో ఎల్ఎస్‌డబ్ల్యూఆర్ సామర్థ్యాన్ని సమర్థవంతంగా అమలు చేస్తే ప్రభుత్వరంగంలోని మన విద్యావిధానం అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోగలదని నిశ్చయంగా చెప్పవచ్చు.

# నిర్మలమైన మనసున్న త్యాగశీలి రమాబాయి అంబేద్కర్



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ , రమాబాయి 1897 , మే 7 న బికువలదకార్కు రెండవ కుమార్తెగా వాలంగ్ గ్రామంలో దపోలో దగ్గర జన్మించారు . వీరిది చాలా పేద కుటుంబం . తండ్రి కూలిపని చేసేవారు . బుట్టలో చేపలు పెట్టుకొని సముద్రపు తీరంలో ఓ బారులో అమ్మేవారు . అతని సంపాదన వారి తిండికి కూడా సరిపోయేది కాదు . అన్న కూలి పనిచేసేవారు . చిన్నతనంలోనే తల్లి చనిపోయింది . కొంత కాలానికి తండ్రి కూడా మరణించాడు . తర్వాత బొంబాయిలో ఉండే మేనమామ వీరిని పోషించారు . రమాబాయికి తొమ్మిదేళ్ళ వయసులో , అప్పటికే పదో తరగతి కూడా పూర్తి కానీ 14 సంవత్సరాల అంబేద్కర్ తో పెళ్ళి జరిగింది . వారి వివాహం జరిగిన విధానం ఆ కాలంలోని పేద జీవితానికి అద్దంపడుతుంది . వారి వివాహం బైకుల్లా చేపల మార్కెట్ ( బొంబాయి ) లో జరిగింది . మార్కెట్ మూసిన తర్వాత , రాత్రిపూట మార్కెట్ లోని ఓపెన్ షెడ్లో వీరి వివాహం జరిపించారు . అంబేద్కర్ రమాబాయితో గడిపిన కాలం తక్కువేనని చెప్పవచ్చు . అంత అరుదైన ఆమె సాన్నిహిత్యాన్ని కోల్పోయిన అంతులేని బాధని అంబేద్కర్ ఒక వ్యాసంలో ప్రస్తావించారు . బహిష్కృత భారత్ పత్రిక 3 ఫిబ్రవరి 1928 నాటి సంపాదకీయంలో " నేను స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత కూడా ఆపత్కాలంలో తలపై పెట్టుకొన్న ఆ పేడ తట్టని ఆమె వదలాలని కానీ , వెనక్కి ముందుకీ చూడాలని కానీ ఎన్నడూ తలంచలేదు . అలాంటి మమతామూర్తి అయిన సామాన్య స్త్రీతో రోజులోని 24 గంటల్లో ఆర్థగంట కూడా గడపలేక పోయాను " అన్నారు . తన తొమ్మిదవ యేటనే రమాబాయి అంబేద్కర్ జీవితంలోకి ప్రవేశించారు . నలుగురు సంతానాన్ని పెంచి పోషించే క్రమంలో రమాబాయి మీద , వయస్సుకి మించిన బాధ్య తలు పడ్డాయి . దాదాపు తొమ్మిది దశాబ్దాల క్రితం ఒక స్త్రీ ఒంటరిగా బండెడు సంసారాన్ని మోయగలిగిందంటే చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుంది . ఇరుగుపొరుగువారి నూటిపోటి మాటలు మనసుని కాల్చేస్తున్నా కడుపు నిండడమే చాలా కష్టంగా ఉన్నా , చెదరని విశ్వాసంతో బిడ్డలని పెంచి పోషించారు రమాబాయి . తను పడుతున్న కష్టాలను అంబేద్కర్కి ఏనాడూ తెలియనిచ్చేవారు .్న కాదు . ఆ విధంగా తెలియడం వల్ల భర్త చదువుకి ఆటంకంగా తయారవుతుందని భావించేవారు . అయినప్పటికీ ఓసారి తప్పనిసరి పరిస్థితుల్లో అబ్బాయి గంగాధర్ అనారోగ్యం విషయమై రమాబాయి అంబేద్కర్కి ఉత్తరం రాశారు . ఆ ఉత్తరం చేరడంతోనే అంబేద్కరు తనవద్ద ఉన్న దాంట్లోనే కొంత డబ్బుని తీసి వెంటనే ముంబాయికి పంపించారు . చాలామంది అంబేద్కర్ మిత్రులు సహాయ పడటానికి ముందుకొచ్చినా వారి సాయాన్ని రమాబాయి సున్నితంగా తిరస్కరించేవారు . అంబేద్కర్ సోదరుడు బలరాం ఒక చిన్న సంస్థలో ఉద్యోగంచేస్తూ ఈ పరిస్థితులను గమనించి ఇంట్లోవాళ్లందరికీ కొత్త బట్టలు కొనడానికి డబ్బులు ఇచ్చారు . రమాబాయి కోసం కూడా కొత్తచీర తెచ్చుకొమ్మని డబ్బులిచ్చారు . కానీ ఆ డబ్బుతో రమాబాయి అంబేద్కర్ కు ధోవతుల జత ఒక పరుపు , దిండు , అన్నం తినేందుకు కూర్చునే పీట కొని తెచ్చారు . రమాబాయి కుమారులలో ఒకరైన యశ్వంత్ కి పోలియో రావడంతో వైద్య ఖర్చులు కూడా లేని స్థితిలో సంసారాన్ని ఈదడమే కష్టంగా మారింది . రమాబాయి ఎప్పుడూ చాలా తెలివిగా బాధ్యతగా వ్యవహరించేవారు . కడు పేదరికంలో ఉన్నప్పటికీ , ఎప్పుడూ ప్రశాంత వదనంతో వుండేవారు . వివాహ సమయంలో ఆమెకు చదువురాదు . అంబేద్కర్ ఆమెకి చదవడం , రాయడం నేర్పించారు . అంబేద్కరంటే ఆమెకు అమితమైన ప్రేమ , అనురాగంతో కూడిన గౌరవం ఉండేది . సమ్మకం , త్యాగం . అర్థంచేసుకునే గుణం వీరిరువురినీ జీవితాంతం ఆనందంగా ఉండేట్లు చేసింది అంబేద్కర్ అని పిలిచేవారు . ఆమె తన భర్తని సాహెబ్ అని పిలిచే వారు నిరంతర అధ్యయనంతో జ్ఞానసముపార్జనతో నిమగ్నమైన తన భర్తని చూసి ఆమె చాలా గర్వపడేవారు . ఆయన అభివృద్ధికోసం నిత్యం పరితపించేవారు . అంబేద్కర్ ఇంటికోసం అసలు సమయం కేటాయించేవారు కాదు . అయినా ఆమె సంసార బాధ్యతల్ని చక్కగా నిర్వహించేవారు . అంబేద్కర్ తన కిచ్చిన డబ్బును ముప్పై భాగాలుగా చేసేవారు . రోజుకొక భాగాన్ని మాత్రమే ఖర్చుపెట్టేవారు . పొదుపుగా యాభై రూపాయలు మాత్రమే ఇంటి ఖర్చులకు వాడి మిగతా డబ్బును భర్త చదువు కోసం పొదుపు చేసేవారు . ఈమె కేవలం భార్యలా కాక ఒక తల్లిలా అంబేద్కర్ని కంటికి రెప్పలా కాపాడి భారత జాతికి ఓ మహోన్నత నాయకున్ని అందించడంలో చిరస్మరణీయురాలిగా మిగిలిపోయారు . అంబేద్కర్ పై చదువులకు అమెరికా వెళ్ళాలనుకున్నప్పుడు ఇంటిదగ్గర స్త్రీలంతా రమాబాయికి పంపవద్దని చెప్పారు . అక్కడ వేరే స్త్రీని పెళ్ళాడితే ఏంచేస్తావు ? అని ప్రశ్నించారు . ఆమె అలాచేయక అంబేద్కర్ అమెరికా వెళ్ళటానికి సహకరించారు . ఇది ఆమెకు అతనిపై ఉన్న అచంచల విశ్వాసం , ప్రగాఢమైన నమ్మకానికి నిదర్శనం . ఇంగ్లాండ్ కెళ్ళిన కొద్దిరోజులకే అంబేద్కర వద్ద ఉన్న డబ్బు అయిపోయింది . ఇక్కడ నా పరిస్థితి ఏమీబాగోలేదు . తినడానికి తిండి లేదు . నాదగ్గర డబ్బు కూడా పూర్తిగా అయిపోయింది . మీకు పంపలేను . అని రమాబాయికి ఉత్తరం పంపారు ఇలాంటి ఎన్నో ప్రతి కూల పరిస్థితులు వచ్చినా భర్తకు అండగా నిలిచారు రమాబాయి తర్వాత అంబేద్కర్ ఎన్నో డిగ్రీలు పొందారు . అవన్నీ రమాబాయి త్యాగనిరతికి ప్రతీకలుగా చెప్పవచ్చు . వీరికి ఐదుగురు పిల్లలు . కొడుకులు రమేష్ , గంగాధర్ , యశ్వంత్ , రాజరతన్ కూతురు ఇందు . ఒక్క యశ్వంత్ తప్ప మిగిలిన వారందరూ మరణించారు . పిల్లల మరణం ఆ దంపతుల్ని కుంగతీసింది . దాంతో రమాబాయి అనారోగ్యానికి గురయ్యారు . ముఖ్యంగా రాజరత్న మరణం ఆమెను తీవ్ర అనారోగ్యానికి గురిచేసింది . 1935 మే 27 న అంబేద్కర్ ప్రేమతో ' రాము'గా పిలుచుకునే రమాబాయి 38 సంవత్సరాల వయసులోనే అంబేద్కర్ కి శాశ్వతంగా దూరమయ్యారు . పవిత్రమైన నిర్మలమైన మనసు మూగబోయింది . ఆమె మరణించిన తర్వాత అంబేద్కర్ కన్నీరు మున్నీరుగా విలపించారు . చివరకు సన్యాసం తీసుకోవాలని భావించారు . ఎంతోమంది మిత్రులు నచ్చచెప్పి అంబేద్కర్ని మామూలు మనిషిగా మార్చారు . ఈ విధంగా కటిక దారిద్ర్యంలో జీవితం కొనసాగించిన రమాబాయి ఏ రకమైన ప్రలోభాలనూ తన దరిదాపుల్లోకి రానివ్వలేదు . తన భర్త బారిష్టరైనా ఆమె పిడకలుచేసి సంసారాన్ని నడిపించారు . ఆమె ఇవన్నీ చేస్తూ కేవలం తన బాధ్యతలను నెరవేరుస్తున్నానని అనుకున్నారు . కానీ తనకు తెలియకుండానే ఆత్మగౌరవంతో , మానసిక నిబ్బరంతో జీవించారు . ప్రపంచ మేధావి అయిన అంబేద్కర్ జీవన గమనంలో రహదారిగా మారారు . ఇలాంటి ధన్యజీవి రమాబాయి జీవితం అందరికీ ఆదర్శం ..

**-పాలడుగు. రవివర్మ**
**సామాజిక విశ్లేషకులు**
**మొబైల్ 9704722470**

## తియ్యగా గుర్తొస్తున్నాయ్ మిత్రమా!





ఎండా కాలం సెలవుల్లో అమ్మమ్మ గారింటికి ప్రయాణాలు...
అక్కడ కొత్త కొత్త చిన్న పిల్లలు....
కొత్త కొత్త స్నేహాలు...
పచ్చని పొలాల్లో, చెఱుకు తోటల్లో, అరటి తోటల్లో
ఆటలు, పాటలు, బావుల్లో ఈతలు...
ఈత కొట్టి యింటికొస్తే మామయ్య భయపెట్టలేదు.
బావిలో మునిగిపోతే అంటూ కొట్ట బోలేదూ ! ...
అప్పుడు అమ్మమ్మ మనకు మద్దతివ్వలేదూ !...
వాళ్ళు పిల్లలు రా !..ఆటలే ప్రాణం రా...
వాళ్ళను ఆడనివ్వండి..పాడనివ్వండి నువ్వు అంతే
చిన్నపుడు అంటూ మామయ్యను అమ్మమ్మ కసురుకోలేదూ!...
గతం గుర్తుకొస్తోంది మిత్రమా !...
చెల్లి నడిచిన బుడి బుడి నడకలు,
నేలపై బుల్లి తమ్ముడు ప్రాకుతున్న రోజులు...
నాన్న మన వేలుపట్టి నడిపించిన క్షణాలు, అమ్మ చేతి కమ్మనైన గోరు ముద్దలు...
అవి తినిపిస్తూ అమ్మపాడిన చందమామ రావే.... జాబిల్లి రావే....! పాటలు...!
ఎంత మధురం బాల్యం ... ఎంత హాయి బాల్యం ...
యింకా గుర్తొస్తూనే వున్నాయి మిత్రమా !...
చందమామ మనకు మామెలా అవుతాడమ్మా!అని అమాయకంగా అడిగితే...
అమ్మ నవ్విన క్షణాలు, మట్టిలో ఆడిన రోజులు, వర్షం లో తడిసిన రోజులు,
రాగం రాక పోయిన ఘంటసాల వారి పాటలు పాడుకొన్నరోజులు....
తియ్యగా గుర్తొస్తున్నాయ్ మిత్రమా!..

**..డాక్టర్.టి.సుధాకర్ రెడ్డి**

## చిన్నారి పాపలం

చిన్నారి పాపలం
చిరునవ్వు జల్లులం
పెద్దలను ఎంతో గౌరవిస్తాం
పేదలను ప్రేమగా ఆదరిస్తాం

గిజిగాడి అల్లికలం
గునుగుపూల రంగులం
గురువులను పూజిస్తాము
చదువుల బాటన పయనిస్తాం

చిటపట చినుకులం
సీతాకోక చిలకలం
చెలిమికి చేయూతలవుతాం
చెడుమార్గాన్ని విస్మరిస్తాం

అల్లరి పిల్లలం... అయినా
అణుకువగా మేముంటాం
అవినీతిని ఎదిరిస్తాం
నిజాయితీగా జీవిస్తాం

చినుకుపూల రెక్కలం
చదువులమ్మను మొక్కుతాం,
ఓర్పుగా నేర్పుగా వ్యవహరిస్తాం
పట్టుదలతో శ్రమిస్తాం
విజయాన్ని సాధిస్తాం....!!

## మా కోసమే



మా కోసమే.. మా కోసమే
కోయిలమ్మ కచేరీలు
మైనాల ముచ్చట్లు

మా కోసమే.. మా కోసమే
చిలుక పలకరింపులు
గోరింకల అల్లర్లు

మా కోసమే.. మా కోసమే
పిచ్చుకమ్మ కువకువలు
నెమలి నాట్యవిందులు

మా కోసమే మా కోసమే
గువ్వల కేరింతలు
పాలపిట్ట పిలుపులు

మా కోసమే... మా కోసమే
కోడి కొక్కొరోకోలు
బాతు క్వాక్ క్వాక్ లు

**..బా**

# కార్పొరేట్ లను పెంచి-ప్రజలను ముంచే కేంద్ర బడ్జెట్ ను వ్యతిరేకిద్దాం: ఐ ఎఫ్ టి యు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్వర్లు!




రాజమహేంద్రవరం ప్రజాపాలన ప్రతినిధి:తూర్పుగోదావరి జిల్లా గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం రాజమండ్రి లోని ఆనం కళాకేంద్రం వద్దగల అంబేద్కర్ మెమోరియల్ లైబ్రరీ హాల్ లో జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు జి వీరభద్రం అధ్యక్షత వహించగా ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్వర్లు ప్రధాన వక్తగా ప్రసంగించారు. ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 1వ తేదీన మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా ను, దేశ ప్రజలకు వ్యతిరేకంగాను ఉందని విమర్శించారు. ఈ బడ్జెట్ కార్పొరేట్ లను పెంచి-ప్రజలను ముంచుతుందని విమర్శించారు. వ్యవసాయ రంగానికి గాని, విద్య, వైద్య రంగాలకు గాని, సూక్ష్మ,చిన్న మధ్యతరగతి పరిశ్రమల గాని ప్రాధాన్యత ఇవ్వలేదని, సబ్సిడీలు తగ్గించారని, ఉపాధి హామీ పథకానికి, మాతా శిశు సంక్షేమానికి నిధుల్లో కోత విధించారని విమర్శించారు. కార్పొరేట్లకు మాత్రం పన్ను భారాన్ని 12 శాతం నుంచి 7 శాతానికి తగ్గించారని, అంబానీలకు అదానీ లకు ల్యాండ్ లైన్ లు, గొడౌన్లు కేటాయించారని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పెట్టుబడి దారులకు అప్పగించడానికి సిద్ధపడ్డారని విమర్శించారు. కార్మికులకు గాని, కష్టజీవుల కు గాని, పేద ప్రజలకు కానీ ఈ బడ్జెట్లో స్థానం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు ఈ బడ్జెట్ కు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఏడో తేదీ నుంచి చేస్తున్న సమ్మెను బలపరుస్తూ ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర కమిటీ ప్రచురించిన పోస్టర్లను ఈ సర్వసభ్య సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు జి వీరభద్రం, గౌరవ అధ్యక్షులు కోరాడ అప్పారావు ఆవిష్కరించారు. వీరభద్రం మాట్లాడుతూ రివర్స్ పిఆర్సి రద్దుచేయాలని, ఉద్యోగ సంఘాల డిమాండ్ మేరకు కొత్త పిఆర్సి ప్రకటించాలని, సి పి ఎస్ రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ను పర్మిట్ చేసి పి ఆర్ సి ప్రకటించాలని, స్కీం వర్కర్లను పిఆర్సి పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నందమూరి దుర్గారావు, డి శ్రీనివాసరావు, పోసియ్య, రామకృష్ణ, తాతారావు, షరీఫ్, కిషోర్ ర్ ఆర్ , లక్ష్మణ్, శివ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి, సంఘంఅభివృద్ధికి జగన్మోహన్‌రావు సేవలు అమూల్యం : డా.తాడివలస దేవరాజ్



చీరాల : నాయీ బ్రాహ్మణ సోదరులఅభ్యున్నతికి, సంఘం అభివృద్ధికి చేసిన కృషి మరువ లేనిదని సేవ, సేవగుణం కలిగిన లంక.జగన్మోహన్‌రావు దంపతులు, మరింతమందికి సహాయసహకారాలు అందించాలని, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎం.డి, చీరాల జిల్లా కేంద్ర సాధన సమితి జేఏసీ కన్వీనర్ డా.తాడివలస దేవరాజ్ ఆశాభావం వ్యక్తం చేశారు. పేరాలలో జరిగిన ఐటీసీ ఎలక్ట్రికల్‌సూపర్వైజర్ లంక జగన్‌మోహన్‌రావు, పదవివిరమణ కార్యక్రమంలో, డాక్టర్ తాడివలస దేవరాజ్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందరరేగా డాక్టర్ తాడివలసదేవరాజు మాట్లాడుతూ, చీరాల మరియు ప్రకాశంజిల్లా నాయీబ్రాహ్మణ ఉద్యోగ, సంస్కృతి, సేవసంఘంతరఫున అనేకకార్యక్రమాల్లో లంక.జగన్‌మోహన్‌రావు అందించినటువంటి సేవలు, సహకారం ఎంతో విలువైనవన్నారు. ఈ కార్య క్రమంలో చీరాల-పేరాల నాయీబ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షులు మాచవరం వెంకటేశ్వర్లు, ఆతిని బోసుబాబు, కె.సుబ్బారావ్, కె.శంకర్, ప్రకాశంజిల్లా నాయీబ్రాహ్మణ ఉద్యోగ సంఘం నాయకు లు ఏ వెంకటేశ్వర్లు, భాను ప్రకాష్, కొత్తపేట వెంకటేశ్వర్లు, మల్లి కార్జున మాస్టర్, మార్కాపురం వెంకటరామారావు, శ్రీనివాసరావు, ఐటీసీ ఉద్యోగులు, మిత్రులు, బంధువులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద ప్రాంతాన్ని పరిశీలించిన శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసరావుపేట.ప్రజాపాలన :నరసరావుపేట పట్టణంలోని శ్రీరాంపురంలో పాత పోలీస్ స్టేషన్ సమీపంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక బట్టల దుకాణం పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి .. ఘటన ప్రదేశానికి చేరుకుని ప్రమాదానికి గురైన షాప్ ను పరిశీలించారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ లిఇలాంటి ప్రమాదం జరగడం బాధాకరం అన్నారు. గతంలో ఆటో మొబైల్ షాప్ కూడా ప్రమాదానికి గురైన విషయాని గుర్తు చేశారు. విద్యుత్ శాఖ ఏఈ, డీఈ తో మాట్లాడి సమగ్ర నివేదిక అడిగారు. ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వి ఎస్ పి సాంబశివరావు ,యక్కల వేదాద్రి,గోపి ,జెడ్పిటిసి పి ఓబుల్ రెడ్డి , షేక్ ఖాదర్ బాషా , పాలపర్తి వెంకటేశ్వర్లు , మరియు వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

## కార్యకర్తల ఆత్మీయ సన్మాన సభ



బాపట్ల ప్రజాపాలన :జనసేన పార్టీ బాపట్ల నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సన్మాన సభకు విచ్చేయుచున్న రాష్ట్ర,జిల్లా నాయకులు మూర్తరక్షణనగర్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులు అర్పించారు, అనంతరం బైక్ ర్యాలీ తో ఘన స్వాగతం పలుకుతున్న బాపట్ల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు

## స్వర్గీయ కొంచ సత్య స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎం.పీ భరత్ రామ్



రాజమండ్రి( సిటీ) ప్రజా పాలన ప్రతినిధి : రాజమండ్రి స్థానిక వి.యల్ పురం మార్గాని ఎస్టేట్స్ గ్రౌండ్ లో రాజమండ్రి ఎంపీ, వైస్సార్సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్ మార్గాని భరత్ రామ్ కు అత్యంత సన్నిహితులు స్వర్గీయ కొంచ సత్య స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎం.పీ భరత్. ఈ కార్యక్రమానికి మరొక ముఖ్య అతిధిగా గోపాలపురం శాసనసభ్యులు తలారి వెంకటరావు పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే వెంకటరావు బౌలింగ్ చేయగా ఎంపీ భరత్ బాటింగ్ చేశారు. తరువాత ఎంపీ బౌలింగ్ చేయగా ఎమ్మెల్యే బాటింగ్ చేశారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ కొంచ సత్య తో నాకు చాలా సంవత్సరాలుగా మంచి స్నేహం ఉండేదని, మంచి మిత్రుని కోల్పోయామని అన్నారు. ఈరోజు ఈ టోర్నమెంట్ పెట్టడం ఎంతో ఆనందం గా ఉందని, క్రీడాస్ఫూర్తితో ఆటగాళ్లు అందరూ రాణించాలని కోరారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకటరావు మాట్లాడుతూ కొంచ సత్య తో మంచి అనుబంధం ఉందని అటువంటి వైస్సార్సీపీ నాయకుడిని కోల్పోవడం ఎంతో బాధాకరమని తెలిపారు. యువకులు మంచి క్రీడాస్ఫూర్తి తో ఆడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## లక్ష్మీ దేవీ ప్రసన్న దేశ ఖ్యాతి పెంచే స్థాయికి చేరుకోవాలి

### రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు, వైస్సార్సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్ శ్రీ మార్గాని భరత్



రాజమండ్రి( సిటీ) ప్రజా పాలన ప్రతినిధి:రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ లో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న లక్ష్మి దేవి ప్రసన్న ఢిల్లీ గణతంత్ర వేడుకల పరేడ్లో పాల్గొన్నందుకు ప్రశంసించిన ఎంపీ భరత్. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగిన పరేడ్లో పాల్గొన్న రాజమహేంద్రవరానికి చెందిన చిట్టాబత్తుల లక్ష్మీ దేవీ ప్రసన్న భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్ ఆకాంక్షించారు. ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవం సందర్భంగా పరేడ్ కు హాజరైన ఆర్ట్స్ కళాశాల ఎన్సీసీ విద్యార్థిని, నాయీ బ్రాహ్మణ మహిళా యువతేజం చిట్టాబత్తుల లక్ష్మీ దేవీ ప్రసన్న తన తల్లిదండ్రులతో కలసి ఎంపీ కార్యాలయం నందు కలవడం జరిగింది. కొద్ది సేపు ఆ విద్యార్థినితో ఎంపీ భరత్ ముచ్చటించారు. ప్రసన్నకు ఆ పరేడ్లో పాల్గొనే అవకాశం వచ్చినందుకు రాజమహేంద్రవరం వాసులుగా గర్విస్తున్నామన్నారు. ప్రసన్నకు భవిష్యత్తులో మరిన్ని మంచి అవకాశాలు రావాలని, అందుకు ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందే విధముగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ ఎన్సీసీలో ఇప్పటికే ఏ సర్టిఫికెట్ పొందిన ప్రసన్న బి సర్టిఫికెట్ పొందేందుకు సిద్ధమవుతోందని, ఆమె ఆ సర్టిఫికెట్ సాధించాలని ఆకాంక్షించారు. ప్రసన్న తన కష్టం వల్లే ఢిల్లీ పరెడకు వెళ్లిందని, ఆమె రాజమహేంద్రవరం కీర్త ప్రతిష్టలను మరింత పెంచిందని అభినందించారు. ఇటువంటి ఉత్సాహ వంతులకు అండగా నిలబడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రసన్న భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు అజ్జరపు వాసు, హితకారిణి ట్రస్ట్ డైరెక్టర్ మద్దు సతీష్, అందనపల్లి సత్యనారాయణ, మారిశెట్టి వెంకటేశ్వరరావు, గేడి అన్నపూర్ణరాజు, బిల్డర్ చిన్నా, నందం స్వామి, సప్పా ఆదినారాయణ, మార్గాని బుజ్జి, కేదారశెట్టి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## సర్కిల్ ఇన్ స్పెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ చిర్ల మరియు జిల్లా ఎస్పీ రవీంద్రనాద్ బాబు



రావులపాలెం (ప్రజాపాలన ప్రతినిధి) : రావులపాలెం సర్కిల్ ఇన్ స్పెక్టర్ కార్యాలయాన్ని ఆదివారం ప్రభుత్వ విప్ మరియు శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి, జిల్లా ఎస్పీ రవీంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిర్ల మాట్లాడుతూ స్థలదాతలు కొవ్వూరి వీర్రెడ్డి గారి కుమారులు మరియు కొవ్వూరి భాస్కర రెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి, కొవ్వూరి గంగిరెడ్డి, మాజీ సర్పంచ్ సఖినేటి వాకులరాజు లను అభినందించారు. రావులపాలెం సెంటర్ దినదినాభివృద్ధి చెందుతుంది అని ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది అని ఈ మార్గంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే వారిని కోరడం జరిగింది అని ప్రభుత్వ విప్ తెలిపారు. రావులపాలెం నేషనల్ హైవే ఆక్సిడెంట్ లు ఎక్కువ నమోదు అవుతున్న కారణంగా రావులపాలెం పరిధిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుచేయాలని కోరడం జరిగింది అని, ఇక్కడ ఒక ట్రాఫిక్ సబ్ ఇన్ స్పెక్టర్ మరియు సిబ్బందిని పెంచాలని జిల్లా ఎస్పీ రవీంద్రబాబును కోరడం జరిగింది. రావులపాలెం గ్రామం జిల్లాకు ముఖ ద్వారంగా ఉందని గ్రామం అంతా సీసీ టీవీ కెమేరాలు ఏర్పాటు చేయడానికి సుమారు 20 లక్షల రూపాయలు అవసరమని ఆ మొత్తాన్ని ఇవ్వడానికి ఛాంబర్ ఆఫ్ కామర్స్, సీఆర్సీ, పంచాయతీ వారు ముందుకు రావడం జరిగింది అని పోలీస్ వారు చొరవతీసుకుని ఈ పని పూర్తి చేయించాలని కోరారు. ఎస్పీ రవీంద్రబాబు మాట్లాడుతూ రావులపాలెం స్టేషన్ కు ఒక ట్రాఫిక్ ఎస్.ఐ ను నియమిస్తామని, సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటుకు సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలియచేసారు.

## రాష్ట్రం బాగుపడాలి అంటే.., మీరు ముఖ్యమంత్రిగా రావాలి సార్...

### బాపట్ల పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



చీరాల పర్చూరు : : రాష్ట్రం బాగుపడాలి అన్నా.., ప్రజలు ప్రశాంతంగా జీవించాలన్నా...,మీరు ముఖ్యమంత్రిగా రావాలి సార్...., అని చంద్రబాబుతో,బాపట్ల పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, మర్యాదపూర్వకంగా చంద్రబాబును కలిసిన సందరరేగా, ఎమ్మెల్యే ఏలూరి ఈ విషయం ప్రస్తావించగా, మిగిలిన ఎమ్మెల్యేలు నిజమేనని, రాష్ట్ర పరిస్థితిని టీడీపీ అధినేత చంద్రబాబుకు వివరించారు. రాష్ట్ర పరిస్థితి అధ్వానంగా తయారైందని, అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో రగిలిపోతున్నారని, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు జీవితాలు దురరేంగా మారాయన్నారు. రైతులు అల్లాడిపోతున్నా రని, ముఖ్యమంత్రిగా మళ్లీ చంద్రబాబు వస్తే తప్ప మమ్మల్ని రక్షించే నాధుడు, ఎవరూ లేరని ప్రజలు ఎదురుచూస్తున్నారని, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. అసమర్థ తుగ్లక్ పరిపాలన,చేతివాటం, చేతగానితనంతో ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారన్నారు.

అధినేత చంద్రబాబును కలిసిన ప్రకాశం జిల్లా టిడిపి ఎమ్మెల్యేలు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా.చంద్రబాబునాయుడుని, ప్రకాశం జిల్లా టిడిపి ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగ ళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో, అధినేతతో తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు,పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్, కొండపి శాసనసభ్యులు డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి, తెలుగు దేశంపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యలు భేటీ అయ్యారు. ఈ సందరరేగా వైసీపీ ప్రభుత్వం అశాస్త్రీయంగా చేపట్టిన జిల్లా ల పునర్విభజనఅంశంపై చర్చించారు. విభజనలో పశ్చిమ ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని, అధినేత దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత నిర్మాణం తదితర అంశాలను ఈ సందరరేగా వారు చర్చించారు.

## జస్టిస్ మన్మదరావును కలిసిన కావలి బార్ అసోసియేషన్ సభ్యులు



కావలి ఫిబ్రవరి 6 ప్రజాపాలన ప్రతినిధి : ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిజస్టిస్ మన్మధ రావు కావలికి విచ్చేసిన సందర్భముగా వారిని ఆదివారం కావలి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాటా సురేందర్ రెడ్డి ఆధ్వర్యములో సెక్రటరీ ఆర్ నాగేంద్రబాబు, వైస్ ప్రెసిడెంట్ జయ ప్రకాష్, జాయింట్ సెక్రటరీ బాలాజీ, న్యాయవాదులు పి సునీల్ కుమార్ సింగ్, ఎల్ హజరత్ రెడ్డిమర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వారిని సత్కరించి అభినందనలు తెలియజేశారు.

## దళితవాడలో గ్రావెల్ రోడ్ల నిర్మాణం



ఉండి, ఫిబ్రవరి 6 (ప్రజాపాలన ప్రతినిధి) : ఉండి గ్రామం పెదపేటలో ఎన్నోఏళ్లుగా రోడ్డుకి నోచుకోని దళిత వీధుల్లో గ్రామ సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచ్ కళ్యాణ్ వర్మ, వార్డు మెంబర్ ఘాతల ఝాన్సీల ఆధ్వర్యంలో ఆదివారం గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా తమ దళితవాడకు రోడ్డు సదుపాయం లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నామని వర్షాలు కురిసినప్పుడు తాగునీటికి వెళ్లాలంటే మోకాళ్ళ లోతు నీళ్లలో వెళ్లి త్రాగునీరు తెచ్చుకునే వాళ్లమని జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ దళితవాడకు రోడ్డు నిర్మాణం చేపట్టడం చాలా ఆనందంగా ఉందని స్థానికులు కందుకూరి రాజ్ కుమార్, కాట్రగడ్డ రవి, చిట్టూరి జ్యోతి, గాతల జాన్, కొక్కిలిగడ్డ ఇశ్రాయేలు తదితరులు ఈసందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు.

## డయల్ యువర్ ఎమ్మెల్యే రెండో వార్డులో సమస్యకు పరిష్కారం



కావలి ఫిబ్రవరి 6 ప్రజాపాలన ప్రతినిధి : పట్టణంలో డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం ఆదివారం క్విషన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి రెండో వార్డులో ఒక మహిళ మురుగు కాలువలో మురుగు నీరు నిలిచి పోతుందని సమస్యలు పరిష్కరించాలని తెలియజేశారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. మురుగునీరు ప్రాంతాన్ని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులకు తెలియజేశారు. ఆ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు.

## టీడీపీ సీనియర్ నాయకులు అతవుర్ రహమాన్ తండ్రి అబ్దుల్ హాఫిజ్ మృతి



చందోలు (పిట్టలవానిపాలెం - ప్రజాపాలన) : పిట్టలవానిపాలెం మండల పరిధి లోని చందోలు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు అతవుర్ రహమాన్ గారి తండ్రి అబ్దుల్ హాఫిజ్ (95) శనివారం మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న బాపట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ వేగేశన నరేంద్ర వర్మ ఆదివారం చందోలు సందర్శించి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ముస్లీం సోదరులతో కలిసి అయన మట్టి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టీడీపీ ఉపాధ్యక్షుడు అబ్జాల్, రజాక్,మీరా, ఖాసీం ఉన్నారు...

# కుల్కచర్ల, దోమ పోలీస్ స్టేషన్లు తనిఖీ

## వికారాబాద్ జిల్లా ఎస్పీ ఎన్.కోటి రెడ్డి ఐపిఎస్

వికారాబాద్ బ్యూరో 06 ఫిబ్రవరి ప్రజాపాలన : గంజాయి, డ్రగ్స్, గుట్కా, నిర్మూలన కొరకు అవగాహన కార్యక్రమలు నిర్వహించాలని వికారాబాద్ జిల్లా ఎస్పి ఎన్.కోటిరెడ్డి సూచించారు. ఆదివారం కుల్కచెర్ల, దోమ పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పీ తనిఖీ చేయడం జరిగింది. అందులో భాగంగా రిసెప్షన్, స్టేషన్ రికార్డు రూమ్, %ఎ్‌ఎ్‌అం% రైటర్ రూమ్, కోర్ట్ మానిటరింగ్ఆఫీస్, జనరల్ డైరీ, స్టేషన్ పరిధిలో నేరస్తుల జాబితా, లాకవ్, పార్కింగ్, మరియు పరిసరాలు పరిశిలించారు. అనంతరం పోలీస్ స్టేషన్లలోని రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులు, కేసుల్లో పురోగతి, కేసులను దర్యాప్తు చేసే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. పోలీస్ స్టేషన్లో రికార్డులను ఆన్లైన్లో పొందుపరుస్తూ 5%ం% ఇంప్లిమెంట్ చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు పూర్తి భరోసా, ధైర్యం ఇచ్చేలా, ఇన్వెస్టిగేషన్ నిర్వహించాలని, ఎటువంటి పిటిషన్లు పెండింగ్లో లేకుండా తక్షణవే పరిష్కరించాలని సూచించారు. ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించే సమయంలో సమయపాలన తప్పకుండా పాటించాలని, వృత్తిపట్ల నిబద్ధత, క్రమశిక్షణ కలిగి ఉండాలని హితవు పలికారు. అలాగే సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏటువంటి నేరాలు జరగకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించుకొని దానికి అనుగుణంగా పెట్రోలింగ్ నిర్వహించాలని , ప్రతిరోజు వాహనాలు తనిఖీ చేయాలని, విజిబుల్ పోలీసింగ్ చేయాలని



కంటిన్యూ పెట్రోలింగ్ చేస్తూ ఉండాలని ఎవరైనా అనుమానాస్పదంగా ఉంటే తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అక్రమ వ్యాపారాలు చేసే వారిపై నిఘా ఏర్పాటు చేయాలని, సమస్యలు సృష్టించే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని అవసరమైతే రౌడీ షీట్స్ ఓపెన్ చేయాలని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా ప్రజలకు కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. రోజురోజుకు కరోనా ఓమిక్రాన్ కేసులు పెరుగుతున్న వల్ల అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కోవిడ్ నిబంధనలు పాటించని వారిపై విపత్తు నిర్వహణ కింద కేసు నమోదు చేయాలని తెలిపారు. గుట్కా, గంజాయి లాంటి నిషేధిత పదార్థాలు అమ్మకాలు, అక్రమ రవాణా నిరోధించడం, అక్రమ వ్యాపారులు చేసే వారి పైన కఠినంగా వ్యవహరించాలని అని అలాగే డయల్ 100 కాల్ వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ గారు సూచించారు. ఇట్టి కార్యక్రమంలో పరిగి డిఎస్పి శ్రీనివాస్, పరిగి సిఐ వెంకటరామయ్య, కుల్కచెర్ల ఎస్ఐ గిరెన్న, మరియు దోమ ఎస్ఐ రమేశ్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దేరు దగ్గర జూరాల కాల్వలోకి దూకిన తల్లీపిల్లలు

వనపర్తి: జిల్లాలోని పెద్దేరు దగ్గర విషాదఘటన చోటుచేసుకుంది జూరాల కాల్వలోకి తల్లీపిల్లలు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ముగ్గురు పిల్లలతో కలిసి జూరాల కాల్వలోకి తల్లి దూకింది. బాలుడిని స్థానికులు రక్షించారు. తల్లీ, ఇద్దరు పిల్లల కోసంగాలింపు కొనసాగుతున్నాయి. కుటుంబ కలహాలే కారణమని స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | |
|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | చేవెళ్ల | 9849526878 |
| డి. వరప్రసాద్ | తెల్లాపూర్ | 9553999990 |
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటచారి | మందమర్రి | 9440868581 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| కళ్యాణ్ సి.ఎం. | కూకట్‌పల్లి | 7842672389 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| టి.రాంబాబు | శేర్లింగంపల్లి | 6301925113 |
| సత్య కిషోర్ | సిద్దిపేట | 6309723472 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492927684 |
| బోడ మమత | జగిత్యాల | 9491127684 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | మయూర్ సెంటర్ | 9160400339 |
| మాలేడు నరేందర్ | ఖమ్మం రూరల్ | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | ఖమ్మం టౌన్ | 9948327333 |
| కోన.నరసింహారావు | మధిర రూరల్ | 9949426541 |
| ఆర్.శ్రీనివాస్ | ఎర్రుపాలెం మండలం | 8501020885 |
| బుక్య.శ్రీను | బోనకల్ | 868810293 |
| రత్నకిషోర్ నంద్రు | ఎర్రుపాలెం | 8142196692 |
| సి.మల్లేష్ | ఇబ్రహీంపట్నం | 9618028334 |
| భుక్య శ్రీను | బోనకల్ | 86881020885 |
| సాయికృష్ణ | వైరా | 9951486635 |
| పి.పండు | చేవేళ్ల | 9963293635 |
| గొల్లపూడి దశరధన్ | జిల్లేడు, చౌదరిగూడ | 9951334682 |
| పుప్పాల కిరణ్ కుమార్ | రాజేంద్రనగర్ | 9666603538 |


## అంబేద్కర్ సెంటర్ నందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారతదేశ రాజ్యాంగ రూపకర్త డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పాలభిషేకం

మధిర ఫిబ్రవరి 6 ప్రజాపాలన ప్రతినిధి: మధిర మున్సిపాలిటీ పరిధిలో మండల కాంగ్రెస్ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబా అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం నాడు పాలాభిషేకం చేసినప్రతిపక్ష నాయకుడు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందినిఆధ్వర్యంలో అంబేద్కర్



కి పాలాభిషేకం చేసి ప్రస్తుత ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అవమానపరిచిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రాజీనామా చేయాలి.మల్లు నందిని విక్రమార్కటీపిసిసి అధ్యక్షుడు లిరేవంత్ రెడ్డిలి మధిర నియోజకవర్గ శాసనసభ్యులు సీఎల్పీ లీడర్ గౌరవనీయులైన లిమల్లు భట్టి విక్రమార్కలి ఆదేశంతో ఈరోజు మధిర మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో లిమల్లు నందిని విక్రమార్కలి భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారి విగ్రహానికి పాలాభిషేకం చేశారు.భారత రాజ్యాంగాన్ని అవమానపరిచిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్. "మనల్ని మనం రక్షించుకోవడానికి అంబేద్కర్ మనకు ఇచ్చిన ఆయుధం ఈ రాజ్యాంగం. అలాంటి రాజ్యాంగాన్ని పాతి పెట్టాలని కేసిఆర్ కుట్ర చేస్తుండు.భారత రాజ్యాంగాన్ని రద్దు చేసి కొత్త రాజ్యాంగం రాసుకోవాలన్న కేసీఆర్ వ్యాఖ్యలు, చేసిన విమర్శలు రాష్ట్ర,దేశ ప్రజలు మనోవేదనకు గురి చేయడమే కాకుండా ప్రజాస్వామ్య విలువలను కాలరాసినట్టు ఉంది, మన రాజ్యాంగాన్ని ఇది విలువ లేని రాజ్యాంగం అని విమర్శించడం ముఖ్యమంత్రి అధికార దాహానికి దర్పం పడుతుంది, కెసిఆర్ ముఖ్యమంత్రి పదవి కి అనర్హుడని వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ పరంగా డిమాండ్ చేశారు,ఈ కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిసూరంసెట్టి కిషోర్‌లి మధిర మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు లిదారా బాలరాజులి మధిర మున్సిపాలిటీ కౌన్సిలర్ లికోన ధని కుమార్‌లి లిమునుగోటి వెంకటేశ్వరరావులి మధిర పట్టణ కాంగ్రెస్ నాయకులు లిపారుపల్లి విజయ్ కుమార్‌లి మధిర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లిఅద్దంకి రవికుమార్‌లి మధిర మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు లిదుంప వెంకటేశ్వర్రెడ్డిలి గాంధి పదం అధ్యక్షుడు లిఅదురీ శ్రీనివాస్‌లి సైదావలి పురం సర్పంచ్ లిపులి బండ్ల చిట్టి బాబులి మాజీ సర్పంచ్ మాజీ సర్పంచ్ లికర్నాటి రామారావులి మండల మహిళా నాయకురాలు ఆయేషా కమల్ ,మధిర పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు లిషేక్ జహంగీర్‌లి పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు లిబిట్ర ఉద్దండయ్యలి పట్టణ %అత్‌బఎ% అధ్యక్షుడు లిషేక్ బాజీలి పట్టణ కాంగ్రెస్ నాయకులు లిబోలెద్దూ రాజేంద్రప్రసాద్ ఆదిమూలం,శ్రీనివాసరావు, మైలవరపు చక్రి, బండారి నరసింహారావు,సురేష్‌లి మొదలగు వారు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సిబ్బందిని నమ్మించి తడి గుడ్డతో గొంతులు కోశారు

### జెఏసి వైస్ చైర్మన్ టిజెఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.హనుమంతు ముదిరాజ్



వికారాబాద్ బ్యూరో 06 ఫిబ్రవరి ప్రజాపాలన : టిఎస్ఆర్టిసి లో వెంటనే ట్రేడ్ యూనియన్లను అనుమతించి ఎన్నికలు జరపాలని జెఏసి వైస్ చైర్మన్ టిజెఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.హనుమంతు ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం జేఏసీ పిలుపు మేరకు వికారాబాద్ టిఎస్ఆర్టిసి లో ఉద్యోగుల సంతకాల సేకరణ చ్టేశారు. ఈ సందర్భంగా కె హనుమంతు మాట్లాడుతూ సంతకాల సేకరణ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 5వ తేదీ నుండి 14వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ సిద్ధించక ముందు ఆర్టీసీ ఉద్యోగులు అగ్రభాగంలో ఉండి పోరాటం చేశారని గుర్తు చేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ గత రెండు సంవత్సరాల క్రితం సమ్మె తర్వాత యూనియన్ లను రద్దు ప్రకటన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీలోని సమస్యల పరిష్కారానికి నేను కృషి చేస్తానని నమ్మించి ఆర్టీసీ సిబ్బంది గొంతులను తడిగుడ్డతో కోశారన్నారు. టిఎస్ఆర్టీసీలో 49 వేల మంది ఆర్టీసీ సిబ్బంది శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. టిజెఎంయు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జివికె రెడ్డి డిపో కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ టిఎస్ఆర్టిసి లో లేకపోవడంతో 2017, 2021 రెండు వేతన సవరణలు చేయకపోవడం, ప్రతి ఆరు నెలలకొకసారి ఇవ్వవలసిన కరువు భత్యం (%ణూ%) లు 6 ఇవ్వకపోవడం, 2013 వేదన సవరణకు సంబంధించిన ఏరియర్స్ 50% బకాయిలు ఇవ్వకపోవడం, చట్ట వ్యతిరేక డ్యూటీలకు రోజుకు 10, 12,14,16 గంటల వరకు డ్యూటీలు చేయించడం, రకరకాల వేధింపులతో ఇబ్బందులకు గురి చేయడం, ఎదురు మాట్లాడితే డ్యూటీలు ఇవ్వకపోవడం, కిలోమీటర్లు పెంచడం, డిపో స్పేర్ లో పెట్టడం, సస్పెండ్ చేయడం, రిమూవ్ చేయడం, టిఎస్ఆర్టిసి లో ఖాళీలు భర్తీ చేయకపోవడం, ప్రమోషన్లు ఇవ్వకపోవడం, ఆన్ డ్యూటీలో చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వకపోవడం, అనారోగ్య రీత్యా మెడికల్ అన్ ఫిట్ అయితే వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వకపోవడం, సిసిఎస్, పిఎఫ్,ఎస్ఆర్బిఎస్ లలో ఆర్టీసీ ఉద్యోగులు పొదుపు చేసుకున్న సొంత డబ్బులను 2500 కోట్లకు పైగా యాజమాన్యం అవసరానికి వాడుకోవడం ఈ విధంగా అనేక రకాలుగా ఆర్టీసీ సిబ్బందిని సర్వనాశనం చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ డిపో అధ్యక్షుడు దేవిడ్, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ రుక్కయ్య, జాయింట్ సెక్రెటరీ వసంత్ గౌడ్ మరియు వికారాబాద్ డిపో జెఏసి నాయకులు పాల్గొన్నారు.

## వనజీవి చేతులమీదుగా ఆర్టీఐ కార్యాలయం ప్రారంభం..



ఖమ్మం ఫిబ్రవరి 6 ప్రజాపాలన ప్రతినిధి : సమాచార హక్కు ప్రచార వేదిక నూతన కార్యాలయాన్ని ఆదివారం రాపర్తినగర్ బైపాస్ రోడ్డులో గల ఓ అపార్ట్మెంట్లో పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు .తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలు వేశారు . అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజ హితం పౌర సమాచార హక్కు ప్రచార వేదిక సారధులకు హృదయపూర్వక శుభాకాంక్షలు ప్రకటించారు . సమాచార హక్కు ప్రచార వేదిక అధ్యక్షులు కొయిన్ని వెంకన్న ( చార్మర్ శంకర్ ) మాట్లాడుతూ సమాజంలో అవినీతి , అక్రమాలను తమ వేదిక ద్వారా నిరోధించడం మాత్రమే కాకుండా బడుగు బలహీన వర్గాలకు తగిన న్యాయం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు . భారత రాజ్యాంగానికి మేము అనుకూలమని , బుద్ధిజం , మార్క్సిజం , అంబేద్కరిజం , పూలే పెరియార్ ఇజం ,మా సిద్ధాంతం , సమ సమాజం మ ఆశయమని పేర్కొన్నాడు . తెలంగాణ బహుజన జేఏసీ రాష్ట్ర చైర్మెన్ బానోతు భద్రునాయక్ మాట్లాడుతూ సమాచార హక్కు ప్రచార వేదిక ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో ప్రభుత్వఉద్యోగులు , రాజకీయల నాయకులు , పైరవీకారులు , అక్రమాలు , అవినీతి , అన్యాయం అణచివేత , పక్షపాత , రుగ్మతలకు వ్యతిరేకంగా , సాహతోపేతంగా ఉద్యమిస్తామన్నారు . వనజీవి రామయ్యను శాలువాతో ఘనంగా సత్కరించారు . ఈ కార్యక్రమంలో వివిధ సామాజిక సంఘాల నాయకులు , పొతగాని వెంకటేశ్వర్లు , ఎస్కే నజీమా , పాల్వంచ రామారావు , మంగలి ఉపేంద్ర్ , రమాదేవి , రామనాథం ,రిటైర్డ్ సిఐ నాగయ్య , సీనియర్ జర్నలిస్టు అన్నం చిన్ని వెంకటేశ్వర్లు , వీరననాయక్ , శంకర్ నాయక్ , వరి కొల్లు వెంకన్న , రాజు , స్వాతి , ఎస్ వి రాఘవులు , తీగల రాము , మంద బుచ్చిబాబు , సుదర్శన్ , గుంతేటి వీరభద్రం , నీల ప్రసాద్ , రవీంద్ర నాయక్ , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు .

## ఆర్యవైశ్య ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథి ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క సతీమణినందిని



మధిర ఫిబ్రవరి 6 ప్రజా పాలన ప్రతినిధిమధిర పట్టణంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపము నందు మధిర పట్టణ, మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులుగా కార్యదర్శులుగా వనమా కిరణ్, మండల అధ్యక్షులుగా దాచేపల్లి ముత్యాల వంగవీటి రాజశేఖర్ , పురుషోత్తంప్రమాణ స్వీకారానికి తెలంగాణ రాష్ట్ర సీఎల్పీ లీడర్ మరియు మధిర శాసనసభ్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ శ్రీమతి మల్లు నందిని హాజరై వారిని శాలువా పుష్ప గుచ్చం లతో సన్మానించి అభినందనలు తెలిపినారు ఈ కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరం శెట్టి కిషోర్ మాజీ మార్కెట్ చైర్మన్ రంగా హనుమంతరావు, బాలరాజు మున్సిపల్ కౌన్సిలర్లు కోన ధని కుమార్ కాంగ్రెస్ నాయకులు ఆర్యవైశ్యులు తదితరులు హాజరై అభినందనలు తెలిపినారు

## సైకిల్ యాత్ర చేస్తున్న ప్రముఖ సామాజిక కార్యకర్త కు స్వాగతం పలికిన బీపీ నాయక్



బోనకల్, ఫిబ్రవరి 6 ప్రజా పాలన ప్రతినిధి: జల్ జమీన్ మిషన్ ప్రముఖ సామాజిక కార్యకర్త రిటైర్డ్ లయన్ సుభాష్ చంద్ర శేఖర్ సేవ్ వాటర్, సేవింగ్ ఎన్విరాన్మెంట్ అంటూ భారతదేశమంతటా సైకిల్ యాత్ర నిర్వహిస్తూ యాత్రలో భాగంగా ఆదివారం బోనకల్ గ్రామంలో ప్రవేశించడం జరిగింది, ఈ సందర్భంగా బీజేపీ యువనేత ఎన్నారై బీపీ నాయక్, లంబాడి హక్కుల పోరాట సమితి మండల ఉపాధ్యక్షుడు రమేష్ నాయక్ మరియు ఇతర స్నేహితులతో కలిసి స్వాగతం పలికారు. అనంతరం బి పి నాయక్ ప్రముఖ సామాజిక కార్యకర్త సుభాష్ చంద్ర శేఖర్ ను ఇంటర్వ్యూ చేసి యాత్ర విషయాలు మిషన్ లక్ష్యం, అతని ఆరోగ్య విషయాల గురించి తెలుసుకున్నారు. అతనికి మార్గమధ్యంలో అవసరమయ్యే పండ్లు మంచినీళ్లు అందించి అభినందనలు తెలిపారు.

## తిమ్మాపూర్ లో డ్రగ్స్ మాదక ద్రవ్యాలపై అవగాహన

జన్నారం రూరల్, ఫిబ్రవరి 06 , ప్రజాపాలన:జన్నారం మండల తిమ్మాపూర్ గ్రామంలో గంజాయి డ్రాగ్స్ మదక ద్రవ్యాలపై ఎక్సైజ్ సిఐ సాయిబాబా అదర్యంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. , ఈ



సందర్భంగా అయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని కోరారు, యువత చెడుపవర్తన పట్ల వారి తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరింసాలని అన్నారు. గంజాయి సాగు చేసే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అదేవిధంగా గంజాయి ని ఒక వ్యాపారంగా దంద చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు., ఈ కార్యక్రమంలో లక్షిటిపేట్ ఎక్సైజ్ ఎస్ఐ రాబర్ట్, జన్నారం ఎస్ఐ పి, సతీష్, తిమ్మాపూర్ సర్పంచ్ జాడి గంగాధర్, వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# నేను పుట్టి పెరిగిన ప్రపంచం..



బిఎస్.రాములు

## తొలిపొద్దు

నేను ఏడవ తరగతి చదువుతున్నప్పుడు మా అన్న రాజ నర్సయ్యకు పదిహేనవ యేట పెళ్లి జరిగింది. పక్క వీధిలోని వారి అమ్మాయితో బాల్య వివాహం చేశారు. పెళ్లి చక్కగా జరిగింది. ఆ కాలంలో రాత్రులు పెళ్లిళ్లు జరిపేవారు. మొఖం కనబడకుండా కత్తెర బాసింగాలు కట్టేవారు. పెండ్లికి ఐదురోజులు ముందు అమ్మ గొర్రె పొటేలుతో పోచమ్మకు చేసింది. దగ్గరి చుట్టాలందరిని భోజనాలకు పిలిచింది. పెండ్లికి పదిహేను రోజులు ముందు ఇంటికి కొత్త సున్నాలు వేశాము. మా అన్నతోపాటు, మా తాత, మా అమ్మ, చాకలివాళ్ళు కలిసి సున్నాలు వేశారు. ఇంట్లో కొత్తమట్టి తెచ్చి భూమిని మల్లం చేశారు. ఇంటివెనుక వంటశాల దగ్గర ఏడు గాడిపొయ్యిలు తీశారు. పోచమ్మకు చేసిన తర్వాత మా బేతి రాములు మేనమామ చప్పుడుతో పోయి అందుగు కొమ్మ కొట్టుకొచ్చి ఇంటిముందు గుంజకు ఆనుకొని పాతిపెట్టారు. పోచమ్మకు చేసినప్పటినుంచి వెంకటాపురం చిన్నమ్మ, చిన్నాన్న పెండ్లి అయ్యేదాక ఇక్కడే ఉన్నారు. మా నర్సమ్మ అత్త, చిన్నమ్మ, చిన్నాన్న, మేనమామ, తాత, అమ్మమ్మ, అమ్మ కలిసి అందరికి వంటలు చేసేవారు. ఒకరోజుముందు మేనమామ, మేనత్త; మరొకరోజు చిన్నమ్మ అన్నను పెండ్లి పిలగాడ్ని చేశారు. పెళ్ళిరోజు ఉదయం ఔసులోల్ల ఇంటికి పోయి గంటెపుస్తెలు (మంగళసూత్రాలు) చప్పుడుతో ఎదురుకొని వచ్చారు. ఐరేని కుండలను చప్పుడుతో ఎదుర్కొని వచ్చారు. పసుపు విసిరారు. బావినుండి కొత్తనీరు తీసుకువచ్చారు. ఇవన్నీ ముత్తైదువులు చేస్తుంటారు.

పెండ్లి పిల్లకు పసుపురంగు పెండ్లి చీరలు పెట్టారు. అన్నకు మైలపోలు తీయడానికి ఇంటి మంగలి వచ్చేవాల్లు. పెండ్లిపీటలు వేయడానికి పెండ్లి పందిరిలో తలువాలు (తలంబ్రాలు) వగైరా ఏర్పాట్లు చాకలివాల్లు చేశారు. వారం ముందు ఇంటి దూలాలకు రంగు కాగితాలు డిజైన్‌లు చేసి అతికించారు. పెళ్ళిలో పీటలతోపాటు బట్టనేసే దోనుగు కూర్చోడానికి పెట్టారు. పచ్చ జొన్నలు తలువాలుగా వాడేవారు. పెండ్లయిన తర్వాత పెండ్లి పిల్ల, పెండ్లి పిల్లగాడు దగ్గరి చుట్టాలు కలిసి చప్పుడుతో పోచమ్మకు మొక్కి వచ్చారు. అప్పగింతలకు ముందు పందిరిలో పెండ్లి పిల్లలను పెండ్లి పెద్దలు ఆడించారు. పదిహేనురోజులపాటు రకరకాల పెండ్లి పండగలు జరిగాయి. మారుపెండ్లి భోజనాలు. వియ్యపురాళ్ళ వయనం, కల్లు, గుడాలు, మాంసంతో భోజనాలు. పదహారు రోజుల పండుగ చేయడంతో పెండ్లి సంప్రదాయాలు పూర్తయ్యాయి.

పెళ్లి చక్కగా జరిగింది. ఆ కాలంలో రాత్రులు పెళ్లిళ్లు జరిపేవారు. మొఖం కనబడకుండా కత్తెర బాసింగాలు కట్టేవారు. పెళ్లయ్యాక పిల్లలను ఎత్తుకొని పందిరికింద వాకిట్లో ఆడేవారు. పదహారు రోజుల పండుగ దాకా రోజు రకరకాల భోజనాలు, చుట్టాల రాకడ.

పెళ్ళయిన తర్వాత కూడా ప్రతి పదిహేను రోజులకు, నెల రోజులకు కోడలును తోలుకొచ్చుకోవాలని బయల్దేర దీసేవాళ్లు. ఒక సాయంత్రం మాంసాహారంతో అయిదు, పది మంది విందు భోజనం చేసి మరుసటి రోజు ఉదయం కోడలును ఇంటికి తెచ్చేవారు. మళ్లీ నెలకి వాళ్లు అమ్మాయిని తోలుకుపోవడానికి వచ్చే వాళ్లు. మళ్లీ అవే మర్యాదలు, విందు భోజనాలు.

(మిగతాభాగం రేపటి సంచికలో..)

# భారత జాతి గర్వించదగిన గానకోకిల లతా మంగేష్కర్!

## అభ్యుదయ కళా సేవ సమితి జిల్లా అధ్యక్షుడు మద్దెల శివ కుమార్

భద్రాద్రి, కొత్తగూడెం : తన మృదు మధుర మంజుల మనోహర ముగ్ధ మాధుర్యమైన తీయ తేనియ లోలికే అమృత జల్లులు జాలువారే గాత్రంతో దాదాపు ఆరు దశాబ్దాల పాటు 20 భాషలలో 780 చిత్రాలలో 50 వేలకు పైగా మధురమైన పాటలను పాడి సంగీత ప్రపంచాన్ని ఓలలాడించి పద్మ విభూషణ్ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు భారతరత్న లాంటి అత్యున్నత మైనటువంటి పురస్కారాలను పొంది కోట్లాది మంది సంగీత అభిమానుల హృదయాలలో చెరగని స్థానాన్ని పొందిన దివంగత లతామంగేష్కర్ భారత జాతి గర్వించదగిన గానకోకిల అని ఆమె పాటకు మరణమే లేదని అభ్యుదయ కళా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కవి సినీ గీతరచయిత గాయకులు సమాజసేవకులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ మద్దెల కన్నీటిపర్యంతమయ్యారుదివంగత లతామంగేష్కర్ అకాల మరణానికి సంతాపం సానుభూతిని తెలియజేసిన వారిలో మద్దెల శివ కుమార్ తో పాటు అపర బాలు అల్లి శంకర్ సంగీత దర్శకులు గౌరవాధ్యక్షులు మా రపాక కృష్ణస్వామిజిల్లా ఉపాధ్యక్షులు సినీనటులు టి ధనరాజ్ లతోపాటుప్రముఖ సినీ సంగీత దర్శకులు మెలోడీ మాస్టర్ శ్రీ ఘంటాడి కృష్ణ సినీ నటులు దర్శకులు శ్రీ ప్రభంజన్ శృతిలయ ఆర్ట్స్ అకాడమీ గాన కోకిల శ్రీమతి ఆమని అక్కఆదర్శ ఫౌండేషన్ చైర్మన్ మరియు సమాజ సేవకులు శ్రీ కుసుమ భోగరాజు ప్రముఖ గాయకులు సుభాష్ తదితరులు ఉన్నారు.



## తాసిల్దార్.. ఇల్లు కూల్చడానికి మాదిగ కుటుంబమే దొరికిందా?



బీరుపూర్, ఫిబ్రవరి 06 (ప్రజాపాలన ప్రతినిధి): బీరుపూర్ మండల్ తుంగూర్ గ్రామంలో ఎస్సి మాదిగ అతి బీద కుటుంబానికి చెందిన పూదూరి నర్సయ్య నిర్మించుకుంటున్న ఇల్లును బీరుపూర్ తహశీల్దార్ అరిఫోద్దీన్ రెవెన్యూ సిబ్బందితో కలసి దౌర్జన్యంగా అక్రమంగా నూతన నిర్మాణాన్ని కూల్చివేశారు. ఏదైనా సమస్య ఉంటే గ్రామ పంచాయతీకి తెలియజేయాలని మరియు నోటీసులు ఇవ్వాలి అదేమీ లేకుండా ఇంటి యాజమానికి తెలియకుండ ఎస్సి మాదిగ వర్గానికి చెందిన నరసయ్య ఇల్లు కూల్చడం అన్యాయం గ్రామ పంచాయతీ పరిమిషన్ లేకుండ మాదిగ బీద కుటుంబంపై తహశీల్దార్ దౌర్జన్యం ఏంటో మరీ పై అధికారులు ఈయనపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేసి చూడాల్సిందే. మరి ఇలాంటి ల్యాండుకు సంబంధించిన కేసులు గ్రామాల్లో వ్యవసాయ భూములలో ఎన్నో ఉన్నాయని వాటి సమస్యలను పరిష్కారించకుండ ఈ తహశీల్దార్ అరిఫోద్దీన్ గారికి ఎస్సి బీద కుటుంబమే దొరికిందా? అని గ్రామస్తులు గుసగుసలాడుతున్నారు.

## గ్రామ శాఖ అధ్యక్షులు రెంటాల ఆనంద్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కందాళ



పాలేరు పిబ్రవరి 6 ప్రజాపాలన ప్రతినిధి :ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు గ్రామ శాఖ అధ్యక్షులు రెంటాల ఆనంద్, అమ్మ పుష్పమ్మ గారి దశ దిన కర్మ కార్యక్రమానికి హాజరై,వారి చిత్ర పటానికి పులువేసి, నివల్లు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపిన పాలేరు శాసనసభ్యులు శ్రీ కందాళ ఉపేందర్ రెడ్డి. ఎమ్మెల్సీ జిల్లా పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్. ఈకార్యక్రమంలో రూరల్ మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, ఎంపీపీ బెల్లం ఉమా, రూరల్ జెడ్ పి టి సి వరప్రసాద్.. తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పోరాటమే వైఎస్ఆర్ టిపి లక్ష్యం

**వైఎస్ఆర్ టిపి సీనియర్ నాయకుడు గట్టు రాంచందర్ రావు**



వికారాబాద్ బ్యూరో 06 ఫిబ్రవరి ప్రజాపాలన : ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా వైఎస్ఆర్ టిపి పార్టీ కృషి చేస్తుందని పార్టీ సీనియర్ నాయకుడు గట్టు రామచందర్ రావు అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని ఎన్నేపల్లిలో సూర్య ప్రకాష్ టౌన్షిప్ లో వైఎస్సార్ టిపి అధ్యక్షుడు తమ్మలి రాజు జిల్లా అధికార ప్రతినిధి కోళ్ల యాదయ్యల ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి తనయ తెలుగింటి ఆడపడుచు షర్మిల వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల ముందుకు రానున్నదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు షర్మిలను అక్కున చేర్చుకుని ఆదరించాలని కోరారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి అన్ని వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఫీజు రియంబర్స్మెంట్ ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. 137 రోగాల చికిత్స నిమిత్తం ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టిన ఘనత వైయస్ రాజశేఖరరెడ్డి దక్కుతుందని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం వచ్చిన ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి సంక్షేమ పథకాలకు తూట్లు పొడిచారని విమర్శించారు. వైఎస్ఆర్ టిపి వ్యవస్థాపకురాలు షర్మిల త్వరలో పాదయాత్ర చేపట్టనున్నారని చెప్పారు. పాలనా పగ్గాలు చేపట్టే ఆత్రుత లేదని ముందుగా మండల స్థాయి నుండి పార్టీని పటిష్టత పరిచే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని సూచించారు. ప్రతి మండల పరిధి నుండి కనీసం 225 మంది ని పార్టీ కార్యకర్తలు గా గుర్తించాలని హితవు పలికారు. వైఎస్ఆర్ టిపి జిల్లా అధ్యక్షుడు తమ్మలి రాజు మాట్లాడుతూ పార్టీని పటిష్టపరిచేందుకు అహర్నిశలు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రతి మండలాల వారీగా కమిటీలను వేసి పార్టీ నియమ నిబంధనలు ప్రతి కార్యకర్త కు అవగాహన కల్పించి ముందుకు వెళ్తామన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయ షర్మిల ఆధ్వర్యంలో పార్టీని పటిష్టం చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. జాతీయ పార్టీలైన బిజెపి కాంగ్రెస్ ల వైపు ప్రజల దృష్టి సన్నగిల్లిందని విమర్శించారు. టిఆర్ఎస్ బిజెపి బయట ప్రపంచంలో పరస్పరం విమర్శించుకొన్నా అంతరార్థ అవగాహన మాత్రం దండిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రోజీ లీనా రజిని నరేందర్ తదితర వైఎస్ఆర్ టిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## లారీని ఢీకొన్న మధిర డిపో బస్సు



మధిర ఫిబ్రవరి 6 ప్రజాపాలన ప్రతినిధి :నకిరేకల్ బైపాస్ వద్ద ఖమ్మం జిల్లా మధిర డిపోకు చెందిన బస్సు బైపాస్ రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది ప్రమాదం జరిగినప్పుడు బస్సులో దాదాపు 50మంది వరకు బస్సులో ఉన్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ బస్సు మార్జిన్ దాటి రోడ్డు పైకి రావడంతో ఢీ కొట్టినట్లుగా తెలుస్తుంది. ప్రమాదానికి గురైన బస్సు లోనే ప్రయాణికులను వేరే బస్సు లో తరలించారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేస్తున్నారు. ప్రమాదానికి కి కారణమైన లారీ బస్సు ని నకిరేకల్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. బస్సు ప్రమాదంలో స్వల్ప గాయాలైన ప్రయాణికులను 108లో నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## జి జి ఎస్ డెవలపర్స్ రియల్ ఎస్టేట్ ఆఫీస్ ప్రారంభానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్



ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి తేదీ 6 ప్రజా పాలన ప్రతినిధి :ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ రహదారి ప్రక్కన ఉన్న జనహర్ష యందు గంగనమోని సతీష్ ముదిరాజ్ జి జి ఎస్ డెవలపర్స్ ఆఫీసు ను ప్రారంభించిన భువనగిరి మాజి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను లో భాగంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉపాధి కలిగించడంలో వ్యాపారం తోపాటు డెవలప్ కావాలని బిజినెస్ లో వచ్చిన దాన్ని కొంత మేరకు కొన్ని అనాథలకు సహాయం చేయాలని తోటి వారికి ఉపయోగపడే విధంగా ఉండాలని ఆయన సూచించారు, ఈ యొక్క కార్యక్రమం లో పాల్గొన్న నాయకులు రైతు సమితి జిల్లా అధ్యక్షులు వంగేటి లక్ష్మరెడ్డి, రాయపోల్ సర్పంచ్ బలవంతరెడ్డి, ఎంపీటీసీ ఆచన శ్రీశైలం, బర్ల జగదీశ్వర్ యాదవ్, డబికర్ శ్రీను, మాజీ సర్పంచ్ పాశం అశోక్ గౌడ్, ఉపసర్పంచ్ అచ్చన బాలరాజు, కంటేకర్ ఈశ్వర్, డి.విష్ణు ఎండి మునోవార్, నాగరాజు, వెంకటాచారి, ఎన్ నాగరాజు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.



## పెళ్లి రోజు సందర్భంగా ఆర్కే ఫౌండేషన్ అనాధ ఆశ్రమంలో వస్త్ర దానం



మధిర ఫిబ్రవరి 6 ప్రజా పాలన ప్రతినిధి : మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం నాడు.మధిరలో.శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ సభ్యులు మరియు మధిర మండల ఆర్యవైశ్య కోశాధికారి దొడ్డా శ్రీనివాస రావు లక్ష్మీ పెళ్లి రోజు సందర్భంగారోజు సందర్భంగా ఆర్ కే ఫౌండేషన్ అనాధ ఆశ్రమంలో పేదలకు మతిస్థిమితం లేని వారికి దుప్పట్లు లుంగీలు అందజేయడం జరిగింది..ఈ సందర్భంగా దొడ్డ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్కే ఫౌండేషన్ అనాధాశ్రమంలో దిక్కు లేని వారు ఎంతోమంది ఆశ్రయం పొందుతున్నారు వీరి సేవ ఎవరు చేయలేనిది.. వారికి మీ వంతు సహాయ సహకారాలు అందించండి అంటూ మధిర రెస్క్యూ టీం సేవలను కొనియాడారు.. ఈ సందర్భంగా ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ నిస్సి మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అంటూ మతిస్థిమితం లేని వారికి దొడ్డ శ్రీనివాసరావు దుప్పట్లు లుంగీలు అందజేయడం చాలా సంతోషకరం అంటూ. నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆశ్రమంలోని అందరూ దీవించారు.. ఈ కార్యక్రమంలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ చైర్మన్జగన్ మోహన్ రావు కుంద నాగభూషణన రావు సముద్రాల పురుషోత్తం. కొప్పు రావూరి రామ యోగేశ్వరరావు. తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికలో బోరుకు మోటర్ ఏర్పాటు: సర్పంచ్ భాగం శ్రీనివాసరావు



బోనకల్, ఫిబ్రవరి 6 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని గోవిందాపురం ఏ గ్రామం లో సర్పంచ్ బాగం శ్రీను వాసరావు ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న నర్సరీ పార్క్ కు వాటర్ సరఫరా లేనందున స్మశాన వాటిక లో గతం లో దాతలు ఏర్పాటు చేసిన బోర్ కు మోటార్ ఏర్పాటు చేయడం జరిగింది. నర్సరీ పార్క్ స్మశాన వాటిక కు అన్నింటికి ఉపయోగ పడేలా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇస్రం బుజ్జి, వార్డు నెంబర్స్ బోబ్బిళ్ళ క్రిష్ణ, వడ్డే బోయిన చుక్కయ్య, ఎలక్ట్రిషన్ పోట్టపింజర గోపి, రాధాక్రిష్ణ మరియు గ్రామ పంచాయతీ వర్కర్స్ దార సురేష్, రాములు పాల్గొన్నారు.

## లతా మంగేష్కర్ మృతి పట్ల సీఎల్పీ లీడర్ భట్టి విక్రమార్క సంతాపం ..





పాలేరు పిబ్రవరి 6 ప్రజాపాలన ప్రతినిధి :గానకోకిల, భారతరత్న అవార్డు గ్రహీత లతా మంగేష్కర్ మృతి పట్ల తెలంగాణ కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత భట్టి విక్రమార్క మల్లు గారు తీవ్ర సంతాపం తెలిపారు. ఆమె మరణం సంగీత ప్రపంచానికి తీరనిలోటని పేర్కొన్నారు.ఏడు దశాబ్దాలకు పైగా భారతీయ సంగీతానికి ఆమె చేసిన కృషి అద్భుతమన్నారు. దాదాపు అన్ని భాషల్లో పాటలు పాడిన సుప్రసిద్ధ గాయకురాలు అని కొనియాడారు. లతా మంగేష్కర్ గాత్రం అమృతంలా ఉంటుందన్నారు. లతా మంగేష్కర్ గొంతు మూగబోవడం సంగీత ప్రియులకు తీవ్ర విషాదాన్ని కలిగించిందన్నారు. గాన జీవితంలో అనేక అవార్డులను గెలుచుకున్న ఆమె కరోనతో 26రోజులకు పైగా ఆసుపత్రిలో పోరాడి తుది శ్వాస విడువడం చాలా బాధాగా ఉందన్నారు. లతా మంగేష్కర్ కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## రిపోర్టర్ శంకర్ కుటుంబానికి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించిన వనపర్తి మాజీ సర్పంచ్ రాజు నాయక్



ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి తేదీ 6 ప్రజాపాలన ప్రతినిధి :ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలం పరిధిలో లోయపల్లి గ్రామం లోని ఈ మధ్య కాలంలోనే ఎస్ వి బి సి రిపోర్టర్ గా పనిచేస్తున్న కర్ర శంకర్ హఠాత్తుగా మరణించడం తో పాటు వారి కుటుంబానికి సంతాపాన్ని తెలుపుతూ ఆర్థిక సాయం అందజేసిన నంది వనపర్తి మాజీ సర్పంచ్ రాజు నాయక్ తోటి రిపోర్టర్లు సహకారంతో పదివేల రూపాయలు విరాళంగా అందించారు రిపోర్టర్లు వెళ్లి ఈ రోజు వారి కుటుంబాని ఓదార్చి పదివేల రూపాయలు అందజేశారు.



# రిలీజ్ వెర్షన్ లో ప్రభాస్ మార్క్ ఛేంజెస్




సినిమా మొత్తం పూర్తయిన తర్వాత రిలీజ్ వెర్షన్ కాపీ చూసి అందులో మార్పులు.. చేర్పులు కోరే హీరోలు టాలీవుడ్ లో కొందరు ఉన్న సంగతి తెలిసిందే. మెగాస్టార్ చిరంజీవి.. కింగ్ నాగార్జున.. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్..పవర్ స్టార్ పవన్ కళ్యాణ్...సూపర్ స్టార్ మహేష్ లాంటి వారు తుది కాపీ ఒకటికి రెండుసార్లు క్రాస్ చెక్ చూసుకుంటున్నారు. ఎడిటింగ్ వెర్షన్ లో మార్పులు ఏమైనా చేయాల్సి ఉంటే దర్శకుడికి సూచిస్తుంటారు. సినిమాని వీలైనంత ఎక్కువసార్లు చూసుకున్నప్పుడు ఈ ఐడియాలజీ వర్కౌట్ అవుతుంటుంది. ఆ రకంగా సినిమాని దర్శకుడితో పాటు చూసే హీరోలు వీళ్లంతా. ఆ రకంగా సినిమా సక్సెస్ లో హీరోల ఎనాలసిస్ కీలక పాత్ర పోషిస్తోంది.తాజాగా ఆ వరుసలోకి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కూడా చేరారు. ప్రభాస్ కథానాయకుడిగా రాధాకృష్ణ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రం రాధేశ్యామ్ విడుదలకు సిద్దమవుతోన్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఈ సినిమా రిలీజ్ వెర్షన్ ప్రభాస్ చూసి మార్పులు కోరినట్లు సమాచారం. స్క్రీన్ ప్లే మరింత క్రిస్పీగా ఉండేలా ఎడిట్ ప్యాటర్న్ లో కొన్ని మార్పులు చేయమని డార్లింగ్ డైరెక్టర్ కి సూచించినట్లు సమాచారం. మరి డార్లింగ్ ఛేంజెస్ ఎక్కడెక్కడ కోరారు? అన్నది తెలియాలి. క్రియేటివిటీ పరంగా ఇలాంటి మార్పులు ఎవరికి ఇబ్బంది కరమైనవి కావు. ఎడిటింగ్ టేబుల్ పై జరిగే మార్పులు కాబట్టి ఆమోదయోగ్యమైనవే.సినిమా నిడివి తగ్గించడానికి వీలైనంత ట్రిమ్ చేయడానికే మేకర్లు ప్రయత్నిస్తుంటారు. అయితే మేకర్ ఐడియాలజీని హీరోలు క్రాస్ చేసి వెళితేనే ఇబ్బంది. ఇప్పటివరకూ చిరంజీవి..బన్నీ కారణంగా ఏ దర్శకుడు ఇబ్బంది పడిన సన్నివేశం లేదు. అయితే మహేష్.. పవన్ తో దర్శకులకు చిన్నపాటి క్రియేటివ్ డిఫరెన్సెస్ తలెత్తిన సందర్భాలున్నాయి. కానీ అవన్నీ అప్పటికప్పుడే క్లియర్ అయ్యాయి. మరి ప్రభాస్ ఇప్పుడే రంగంలోకి దిగారు కాబట్టి మేకర్ పై అతని ఒత్తిడి ఎలా ఉంటుంది? అని తెలియడానికి కొంచెం సమయం పడుతుంది.

# షూటింగ్ షురూ చేసిన మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి ఇటీవల కరోనా వైరస్ మహమ్మారి తీవ్రత కారణం గా సినిమా షూటింగ్ లకు విరామం చెప్పారు. తాజాగా కరోనా వైరస్ భారీ నుండి కోలుకున్న మెగాస్టార్ చిరంజీవి, గాడ్ ఫాదర్ మూవీ షూటింగ్ లో పాల్గొన్నారు.హైదరాబాద్ లో ఈ చిత్రం షూటింగ్ తాజాగా మొదలైంది. ఈ షూటింగ్ లో నేడు మెగాస్టార్ చిరంజీవి జాయిన్ అయ్యారు. మెగాస్టార్ చిరంజీవి షూటింగ్ లో పాల్గొన్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. మోహన్ రాజా దర్శకత్వం వహిస్తున్న గాడ్ ఫాదర్ చిత్రం లో నయనతార, శ్రియ శరణ్, సత్యదేవ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని %చీఎ=% సినిమా ఎల్ ఎల్ పి మరియు కొణిదెల ప్రొడక్షన్ కంపనీ లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

# సీతమ్మకి లోకల్ బ్రాండ్ అంటేనే మక్కువా?



బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్ ఆర్ ఆర్ ఆర్ రిలీజ్ కి ముందే టాలీవుడ్ లో ఫేమస్ అయిపోతుంది. తనదైన మార్క్ చలాకీతనంతో అందర్ని ఆకట్టుకుంటుంది. ఎన్టీఆర్..రామ్ చరణ్..రాజమౌళి లు మొదటి సినిమాతోనే మంచి స్నేహితులు అయిపోయారు.ఆ కారణంగా యంగ్ టైగర్ తో మరో సినిమా చేయడానికి కూడా అలియా రెడీ అయిన సంగతి తెలిసిందే. కొద్ది రోజులుగా అలియాభట్ తెలుగింట సోషల్ మీడియా యూజర్ ఖాతాల్లో వైరల్ గా మారుతోంది.ఆర్ ఆర్ ఆర్ ప్రమోషన్లో పాల్గొన్న నాటి నుంచి అలియా తెలుగు వారికి సోషల్ మీడియా రూపేనా బాగా దగ్గరైపోయింది. తాజాగా ఈ బ్యూటీ ధరించిన బ్లాక్ పాయల్ ఖండ్ వాలా బ్రాండెడ్ డ్రెస్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో నిలిచింది.దీంతో ఆ డ్రెస్ వెనుక ఆరాలు మొదలయ్యాయి. బెంగుళూరుకి చెందిన మాధుర్య క్రియేషన్స్ ఈ డిజైన్ తాయారు చేసింది. మొదటగా ఈ సంస్థ ఆభరణాల డిజైన్లకు ప్రసిద్ధి. అయితే ట్రెడిషనల్ డిజైన్స్ లో చీరలు..గృహ అలంకరణలోనూ ఫేమస్ అవుతోంది. పేరుకు దేశీ బ్రాండ్ అయినా మాధుర్యలో షాపింగ్ అంటే చుక్కలే. ఆన్ లైన్ లో మాత్రమే విక్రయాలు జరుగుతాయట.టాప్ మోస్ట్ లగ్జరీయిస్ ప్యాషన్స్ బ్రాండ్ పాయల్ ఖండ్ వాలా ఒకటి. సంప్రదాయ అల్లికలు..కుందర్ వర్క్స్ తో లభించే ఈ డిజైన్స్ కి విదేశాల్లో గిరాకీ ఎక్కువ. విదేశీ డిజైన్స్ కన్నా అలియాకి లోకల్ మేడ్ అంటేనే ఎంతో ఇష్టమని తెలిపింది. చాలా మంది ఫ్రాన్స్ కి చెందిన ఫ్రింజ్ ట్రెండ్ అంటే ఇష్టపడతారు. కానీ నాకు ఆ స్టయిల్ పెద్దగా నచ్చదు. అది తప్ప మిగతా ఫ్యాషన్ ట్రెండ్స్ అన్ని ఫాలోఅవుతానని తెలిపింది. ప్రస్తుతం అలియా భట్ గంగూబాయి కతియావాడిలో నటిస్తోంది . ఇటీవల విడుదలైన ఈ సినిమా ట్రైలర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమా అంచనాలు భారీగా పెరిగాయి

# భారతీయ నటి అని పిలిపించుకోవాలనుందట!



తెలుగు నటి .. తమిళ నటి.. హిందీ నటి అంటూ విడదీసి చూస్తే తనకు నచ్చదని తనను ఆల్ ఇండియన్ యాక్ట్రెస్ గా చూడాలని కోరుకుంటున్నానని ప్రియమణి అన్నారు. ప్రాంతాలతో విభేధాలు తగదని భారతీయ నటిగా గుర్తింపు కావాలని ఆశపడుతున్నట్టు వెల్లడించారు ప్రియా.ఏ నటుడు లేదా నటి అయినా భారతదేశంలో ప్రాంతంతో గుర్తించబడటం సాధారణం. బాలీవుడ్ తారలు అనో తమిళ తారలు అనో.. కన్నడ తారలు అనో పిలుస్తాం కానీ భారతీయ నటీనటులుగా పిలవరు. భారతీయ చలనచిత్ర పరిశ్రమను సాధారణంగా బాలీవుడ్ అని... సౌత్ ఇండియన్ ఇండస్ట్రీ అని గుర్తించడం కూడా సాధారణం.అయితే ఈ విషయంలో ప్రియమణికి అభ్యంతరం ఉంది. సౌత్ ఇండియన్ నటి అని పిలవడం అంత కంఫర్ట్ గా లేదని భావిస్తోందట. మమ్మల్ని దక్షిణాది నటులు లేదా బాలీవుడ్ నటీనటులు అని ఎందుకు పిలుస్తారో నాకు తెలియదు. మేమంతా భారతీయ నటులమే అని ఆమె అన్నారు.ప్రియా ఉద్దేశమేమంటే.. జయప్రద శ్రీదేవి వంటి భారతీయ నటీమణులుగా ముద్ర పడితే అది జాతీయ గుర్తింపు. చాలా మంది నటీనటుల ప్రతిభను అన్ని వేదికలపైనా గుర్తించడం నాకు చాలా సంతోషంగా ఉందని ప్రియమణి అన్నారు. ఫ్యామిలీ మ్యాన్ సిరీస్ తో వచ్చిన పాపులారిటీని కొనసాగిస్తూ పాన్ ఇండియా చిత్రాల్లో ప్రియమణికి ఆఫర్లు దక్కడం ఖాయంగా కనిపిస్తోంది. ఆహాలో ప్రియమణి భామా కలాపం స్ట్రీమింగ్ కానున్న సంగతి తెలిసిందే.

# చందమామ కథల్లో విక్రమార్కునిలా పవన్ కళ్యాణ్




పవన్ కళ్యాణ్ చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న హరి హర వీర మల్లు షూటింగ్ వచ్చే నెలలో పునఃప్రారంభించనున్నారు. ప్రస్తుతం ఆయన 17వ శతాబ్దపు యోధుడి పాత్రకు సరిపోయేలా తన జుట్టును పెంచుతున్నాడు. చందమామ కథల్లో యోధుడిలా పవన్ కళ్యాణ్ కనిపిస్తారని గుసగుస వినిపిస్తోంది. ఆంగ్లేయులను ఎదుర్కొనే వీరమల్లు రూపం విక్రమార్కుడినే తలపిస్తుందన్న గుసగుసా వైరల్ అవుతోంది.ఈలోగా దర్శకుడు క్రిష్ పవన్ కళ్యాణ్ ని కలిసి స్క్రిప్ట్ లో తాను చేసిన మార్పులను వివరించాడు. సినిమా షూటింగ్ ఆగిపోయాక.. సుదీర్ఘ మహమ్మారి కాలాన్ని సద్వినియోగం చేసుకున్న క్రిష్ ..తన ఆస్థాన రచయితలతో కలిసి స్క్రిప్ట్ ను మంచి ఆకృతిలోకి తీసుకువచ్చారు.షూటింగ్ ని మళ్లీ ప్రారంభించేందుకు భారీ సెట్లు కూడా వేస్తున్నారు. పీరియాడికల్ డ్రామాలో పవన్ కళ్యాణ్ రాబిన్ హుడ్ తరహా పాత్రను పోషిస్తున్నాడు. నిధి అగర్వాల్ అతని ప్రియురాలి పాత్రలో నటిస్తుండగా.. నర్గీస్ ఫక్రీ మరో కీలక పాత్రలో కనిపించనుంది. ప్రముఖ నిర్మాత రత్నం అత్యంత భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని పాన్ ఇండియా కేటగిరీలో నిర్మిస్తున్నారు. తెలుగు-తమిళం-హిందీలో పాన్-ఇండియన్ ప్రాజెక్ట్ గా ఇది విడుదల కానుంది. ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

# విడాకుల సబ్జెక్ట్ అనగానే చేయాలనుకున్నాను

సుమంత్ హీరోగా నైనా గంగూలీ మరియు వర్షిణి హీరోయిన్స్ గా రూపొందిన చిత్రం 'మళ్లీ మొదలైంది'. ఈ సినిమా ప్రారంభించిన సమయంలోనే అందరి దృష్టిని ఆకర్షించింది. సుమంత్ మళ్లీ పెళ్లి చేసుకోబోతున్నట్లు ప్రచారం చేసి సినిమా ను ప్రకటించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించిన ఈ సినిమా విడుదలకు సిద్ధం అయ్యింది. మళ్లీ రావా సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న సుమంత్ మళ్లీ మొదలైంది సినిమాతో ఇప్పటికే జనాల్లో ఆసక్తిని కలిగించడంలో సక్సెస్ అయ్యాడు. ఈ సినిమా ను థియేటర్ రిలీజ్ కు ప్లాన్ చేసినా కూడా కొన్ని కారణాల వల్ల ఓటీటీ రిలీజ్ కు వెళ్లాల్సి వచ్చిందని యూనిట్ సభ్యులు ప్రకటించారు. ఈనెల 11న డైరెక్ట్ గా జీ5 ఓటీటీ ద్వారా ఈ సినిమా ను స్ట్రీమింగ్ చేయబోతున్నారు.సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో సుమంత్ మాట్లాడుతూ విడాకుల గురించిన సబ్జెక్ట్ తో ఈ సినిమా కథ ఉంటుందని చెప్పగానే ఓకే చెప్పాను. కథ చెప్పే సమయంలోనే ఆ విషయాన్ని చెప్పడంతో వెంటనే చేయాలనుకున్నాను. కథ విన్న తర్వాత ఈ సబ్జెక్ట్ ను అస్సలు మిస్ అవ్వకూడదు అనుకున్నాను అంటూ సుమంత్ చెప్పుకొచ్చాడు. ఈ సినిమా కోసం అనూప్ మంచి పాటలు ఇచ్చాడు. నేను చేసిన ప్రేమ కథ మొదలుకుని నా ప్రతి సినిమాలో కూడా ఒక సిగ్నేచర్ సాంగ్ ఉంటుంది. ఇప్పుడు ఆ సిగ్నేచర్ సాంగ్ ను మళ్లీ మొదలైంది సినిమాలో కూడా పెట్టినట్లుగా చెప్పుకొచ్చాడు. ఇప్పటికే విడుదల అయిన మళ్లీ మొదలైంది ట్రైలర్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఒక సీరియస్ సబ్జెక్ట్ ను ఫన్ స్క్రీన్ ప్లేతో చెప్పినట్లుగా అనిపించింది. కలిసి ఉండటం కష్టం అనిపించిన భార్య భర్తలు విడిపోయిన తర్వాత వారి మానసిక పరిస్థితి ఏంటీ.. ఆ తర్వాత వారి గురించి సమాజంలో అనుకునే మాటలు.. వారి గురించి జనాలు పుట్టించే పుకార్లను గురించి ఈ సినిమాలో చూపించడం జరిగింది. ఈ సినిమాలో సుమంత్ మొదటి భార్య గా వర్షిణి కనిపించగా ప్రియురాలిగా నైనా గంగూలీ నటించింది. రెండో పెళ్లి చేసుకుని కూడా మళ్లీ విడాకులు తీసుకునేందుకు సిద్దం అయ్యాడు అంటూ ట్రైలర్ లో హీరో పాత్రను చూపించడం జరిగింది. మొత్తానికి చాలా ఆసక్తికరంగా ఎంటర్ టైన్మెంట్ తో కూడిన కథనంతో సినిమా సాగుతుందని ట్రైలర్ తో చెప్పకనే చెప్పారు. కనుక జీ5 లో ఈ సినిమా స్ట్రీమింగ్ అయ్యి మంచి విజయాన్ని సొంతం చేసుకుంటుందేమో చూడాలి.









Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989